# దసరా పండుగ సందడి..
## బంధుమిత్రుల రాకతో పల్లెల్లో పండుగ శోభ!



దేశవ్యాప్తంగా దసరా పండుగ సందడి నెలకొంది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. పల్లెల నుంచి పట్టణాల వరకు ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ముఖ్యంగా పండుగ సందర్భంగా బంధువులు, స్నేహితులు ఇళ్లకు చేరుకోవడంతో కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. -4లో

### బంధువుల రాకతో సందడే సందడి

దసరా పండుగ వచ్చిందంటే చాలు.. ఎక్కడెక్కడో ఉంటున్న కుటుంబ సభ్యులు, బంధువులు సొంతూళ్లకు చేరుకుంటారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల కారణంగా దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు పండుగ కోసం స్వగ్రామాలకు వస్తుంటారు. దీంతో ఇళ్లన్నీ బంధుమిత్రులతో కళకళలాడుతాయి. చిన్నారుల ఆటపాటలు, పెద్దల కబుర్లు, ఆప్యాయ పలకరింపులతో కుటుంబాల్లో సందడి నెలకొంటుంది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# మద్యం మత్తు.. ఆపై అతివేగం..!
## కారును ఢీకొన్న బొలెరో..

ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు.. -4లో

డ్రైవర్, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఫిర్యాదు..!

### అవినీతి అధికారులకు
# ఇక చెక్..
## ఏసీబీకి సుప్రీంకోర్టు తీర్పుతో బలం!

- లంచం కేసుల దర్యాప్తునకు ముందస్తు అనుమతి అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ప్రభుత్వ అనుమతుల జాప్యంతో పెండింగ్‌లో ఉన్న ఏసీబీ కేసులకు కదలిక వచ్చే అవకాశం
- 19 సార్లు లేఖలు రాసినా అనుమతి రాని కేసు.. అవినీతి అధికారులపై చర్యలకు కొత్త ఊతం -6లో

## 'సీఎంసీ-విద్యుత్' అధికారుల నిర్లక్ష్యానికి పాడి గేదె బలి..?

- బౌరంపేట్‌లో తెగిపడిన వీధి దీపాల విద్యుత్ తీగ.. షాక్‌తో మూగజీవి మృతి..
- ఫిర్యాదు చేసినా.. ఘటనా స్థలానికి మున్సిపల్ సిబ్బంది, రాలేదని స్థానికుల ఆగ్రహం..
- బాధ్యులపై కేసు నమోదు చేయాలని దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు.. -5లో









బొలెరో ఢీకొనగా, నుజ్జ నుజ్జైన కారు..

# మద్యం మత్తు.. ఆపై అతివేగం..!

# కారును ఢీకొన్న బొలెరో..

## ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు..

## డ్రైవర్, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఫిర్యాదు..!


కారు ప్రమాదంలో మృతి చెందిన కావలి రాజేష్ మృతదేహం..

- మద్యం మత్తులో బొలెరో డ్రైవర్..! కారును ఢీకొట్టిన ఘటనలో యువకుడి దుర్మరణం..!
- గండిమైసమ్మ--అన్నారం మార్గంలోని చర్చి గాగిల్లాపూర్‌లో అర్ధరాత్రి ఈ ఘోర రోడ్డు ప్రమాదం..
- దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు..
- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఇప్పటికైనా కఠినమైన నిఘా ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి..
- మద్యం మత్తులో డ్రైవింగ్‌లపై ఉక్కుపాదం మోపి.. తనిఖీలు నిర్వహించి, ప్రమాదాల నివారించాలి..
- అతివేగానికి కళ్లెం వేయాలని ప్రధాన రహదారులు, ప్రమాదకర మలుపుల వద్ద స్పీడ్ గన్‌లు తప్పనిసరి..
- ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు కఠినతరం చేయాలని కోరుతున్న ప్రజలు..
- ప్రమాదకర ప్రాంతాలు గుర్తించి హెచ్చరికలు బోర్డు, రేడియం స్టిక్కర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలి..
- రాత్రివేళల్లో ప్రత్యేక నిఘా పోలీసు బృందాలు ఏర్పాటు చేసి, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై నిఘా..
- ప్రజల్లో అవగాహనకై, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, వేగ నియంత్రణ పాటించాలని..
- పోలీసులు విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరుతున్నారు..


మృతుడు కావలి రాజేష్..(ఫైల్‌ఫొటో)

**దుండిగల్, పెన్ పవర్, అక్టోబర్ 19:** మద్యం మత్తులో వాహనం నడుపడమే కాకుండా అతివేగం, ఆపై నిర్లక్ష్యంతో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా, మరొకరు గాయపడ్డారు. ఈ విషాదకర ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్‌లో, టాటా హిటాచీ కంపెనీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.. దుండిగల్ పోలీసులు తెలిపిన ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన కావలి మల్లేష్ రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. అక్టోబర్ 18వ తేదీ రాత్రి సుమారు 11.50 గంటల సమయంలో ఆయన బంధువు కావలి రాము ఫోన్ చేసి, మల్లేష్ కుమారుడు కావలి రాజేష్ ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైనట్లు సమాచారం అందించాడు.. దీంతో మల్లేష్ గ్రామస్థులతో కలిసి హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నాడు. అక్కడ తన కుమారుడు రాజేష్ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు..


ప్రమాదానికి కారణమై కారును ఢీకొట్టిన బొలెరో వాహనం..


## పని ముగించుకుని తిరిగి వస్తుండగా..

అదే రోజు (ఆదివారం) రాత్రి సుమారు 11.45 గంటలకు కావలి రాజేష్ (30), తన స్నేహితుడు పాల్నాటి రాకేష్ (31)తో కలిసి తనకు చెందిన "ఎ.పి28ఎ.జెడ్0178" నెంబరు గల కారులో గండిమైసమ్మకు వెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.. పని ముగించుకున్న తర్వాత అక్కడి నుంచి అన్నారం గ్రామానికి తిరిగి వస్తుండగా చర్చి గాగిల్లాపూర్‌లోని టాటా హిటాచీ కంపెనీ సమీపంలో ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్పష్టమవుతుంది.. అన్నారం నుంచి గండిమైసమ్మ వైపు వెళ్తున్న "టిఎస్ 39 సియు 5063" నెంబరు గల బొలెరో వాహనం డ్రైవర్ సేతు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వచ్చి రాజేష్ కారును ఢీకొట్టినట్లు పోలిసులు పేర్కొన్నారు.. ఈ ప్రమాద తీవ్రతకు కారు నడుపుతున్న రాజేష్ తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలై, అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు..

## మరొకరికి తీవ్ర గాయాలు..

మృతుడు రాజేష్ తోపాటు కారులో ప్రయాణిస్తున్న అతని స్నేహితుడు పాల్నాటి రాకేష్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.. ప్రమాద సమయంలో బొలెరో డ్రైవర్ సేతు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు కూడా ఫిర్యాదులో ఆరోపించారు.. మద్యం సేవించి, అతివేగంగా, నిర్లక్ష్యంగా బొలెరో వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సేతుపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో కావలి రాజేష్ మృతి చెందగా, పాల్నాటి రాకేష్ గాయపడటానికి బొలెరో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు.. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసుల వివరాలు వెల్లడిస్తున్నాయి.. మద్యం సేవించి వాహనాలు నడపడం, రహదారులపై అతివేగంగా ప్రయాణించడం వల్ల నిండు ప్రాణాలు బలవుతున్నాయి.. మరోవైపు ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాద ఘటనతో అన్నారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి..

# దసరా పండుగ సందడి.. బంధుమిత్రుల రాకతో పల్లెల్లో పండుగ శోభ!

### పిండివంటలు.. పండుగ ప్రత్యేకతలు

పండుగను పురస్కరించుకుని మహిళలు సంప్రదాయ పిండివంటలు, రుచికరమైన వంటకాలను సిద్ధం చేస్తారు. కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేస్తూ సంతోషంగా గడుపుతారు. కొత్త బట్టలు ధరించి ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. ఇంటి ముందు ముగ్గులు వేస్తూ, పూజలు నిర్వహిస్తూ పండుగ సంప్రదాయాలను కొనసాగిస్తారు.

### చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే పండుగ

దసరా అంటే కేవలం పూజలు, పండుగ వంటకాలే కాదు.. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే వేడుక కూడా. చిన్ననాటి స్నేహితులను కలవడం, బంధువులతో కలిసి సమయం గడపడం, పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ముఖ్యంగా పిల్లలకు సెలవులు రావడంతో ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతారు.

### పల్లెల్లో ప్రత్యేకమైన సందడి

గ్రామాల్లో దసరా పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. ద సొంతూళ్లకు వచ్చిన వారితో గ్రామాల్లో సందడి పెరుగుతుంది. ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపిస్తుంది. కొత్త పనులు ప్రారంభించేందుకు చాలామంది విజయదశమిని శుభదినంగా భావిస్తారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందాన్ని పంచుకుంటారు.

మొత్తంగా

దసరా పండుగ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ, కుటుంబ సభ్యులను ఒక్కచోట చేర్చి ఆప్యాయతలు, అనుబంధాలను పెంపొందిస్తోంది. ఏడాదంతా పనుల్లో బిజీగా ఉండే వారికి ఈ పండుగ బంధుమిత్రులతో ఆనందంగా గడిపే మంచి అవకాశంగా నిలుస్తోంది.


నీటిలో విద్యుత్ తీగలు ఉన్నది తెలియక త్రాగునీటి కోసం వచ్చి పాడి గేదె మృతి..


దుండిగల్ మున్సిపల్ పట్టించుకోక.. స్థానికులే గేదెను తొలగిస్తున్న దృశ్యం..

# 'సీఎంసీ-విద్యుత్' అధికారుల నిర్లక్ష్యానికి పాడి గేదె బలి..?


మృతి చెందిన గేదెకింద విద్యుత్ తీగ..

- బౌరంపేట్‌లో తెగిపడిన వీధి దీపాల విద్యుత్ తీగ.. షాక్‌తో మూగజీవి మృతి..చ
- ఫిర్యాదు చేసినా.. ఘటనా స్థలానికి మున్సిపల్ సిబ్బంది, రాలేదని స్థానికుల ఆగ్రహం..
- బాధ్యులపై కేసు నమోదు చేయాలని దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు..

- దుండిగల్ సీఎంసీ-విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మూగజీవిని బలిగొన్న విద్యుత్ తీగలు..
- బౌరంపేట్ సింహపూరి కాలనీలో తెగిపడిన వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్ తీగలుగా ఆరోపణలు..
- విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతిపై స్పందించని దుండిగల్ 'సిఎంసి-విద్యుత్' యంత్రాంగం..
- ప్రమాదంపై సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులంటూ స్థానికుల ఆగ్రహం..!
- మాది కాదు.. మున్సిపాలిటీది..! అంటూ చేతులెత్తేసిన విద్యుత్ అధికారులు..!
- మృతిచెందిన గేదెను తరలించేందుకు సీఎంసీ సిబ్బంది రాలేదని స్థానికుల ఆగ్రహం..!
- బీజేపీ నేత పీసరి కృష్ణారెడ్డి చొరవ చూపి, జేసిబితో గేదెను అక్కడి నుండి తరలించిన స్థానికులు..
- బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్.. బాధిత రైతుకు నష్టపరిహారం చెల్లించాలని స్థానికులు కోరారు..


ఆ చతురస్రంలో తెగిపడిన విద్యుత్ తీగలు..

**దుండిగల్, పెన్ పవర్, అక్టోబర్ 19:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ సర్కిల్-59 మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో మూగజీవి ప్రాణం తీసిందని స్థానికుల ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.. బౌరంపేట్‌లోని సింహపూరి కాలనీలో వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్ తీగ తెగిపడి కింద పడటంతో విద్యుత్ షాక్‌కు గురైన ఓ పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ తీగలు కిందపడిన విషయాన్ని సంబంధిత అధికారులు ముందుగానే గుర్తించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ప్రమాదం జరిగిన తర్వాత కూడా సంబంధిత మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించలేదని బాధితులు ఆరోపిస్తుండటంతో అధికార యంత్రాంగం తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. బీజేపి మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేతకు వెళ్లిన గేదె.. విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడటం బాధాకరమని ఆవేదన చెందారు.. బౌరంపేట్ సింహపూరి కాలనీకి చెందిన రైతు చిన్నారెడ్డికి పాడి గేదె జీవనాధారంగా ఉంది.. రోజువారీగా మేత మేసి, నీళ్లు తాగేందుకు వెళ్లిన గేదెకు మార్గమధ్యంలో, ఓ కరెంట్ స్థంభం నుంచి తెగిపడిన వీధి దీపాల విద్యుత్ తీగ, నీరునిలిచి ఉన్న గుంతలో పడటంతో,గేదె విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు.. రైతుకు జీవనాధారమైన పాడి గేదె తన కళ్ళెదుటే మృతి చెందడంతో రైతు చిన్నారెడ్డి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు.. పాడి పశువుపై ఆధారపడి జీవించే రైతు కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లిందని బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి అన్నారు..

## దుండిగల్ సీఎంసీ అధికారులూ అదేతీరు..?

విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన విషయం తెలిసినప్పటికీ దుండిగల్ సర్కిల్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘటనాస్థలికి వచ్చి కనీసం పరిశీలించలేదని బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆరోపించారు. ప్రమాదంలో మూగజీవి ప్రాణాలు కోల్పోయినా అధికారులకు మానవత్వం లేకుండా వ్యవహరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.. చనిపోయిన గేదెను అక్కడి నుంచి తరలించేందుకు కూడా మున్సిపల్ సిబ్బంది ముందుకు రాకపోవడంతో, తానే స్థానికులతో కలిసి జేసీబీని తెప్పించి చనిపోయిన గేదెను తరలించాల్సి వచ్చిందని తెలిపారు.. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన మున్సిపల్ యంత్రాంగం, వీధి దీపాల నిర్వహణలో ఇంతటి నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.. వీధి దీపాల విద్యుత్ తీగలు సక్రమంగా ఉన్నాయా లేదా..? పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులకు లేదా..? అంటూ తీవ్రంగా మండిపడ్డారు.. ప్రమాదకర పరిస్థితుల్లో తీగలు కిందపడితే పర్యవేక్షణ ఏదని ప్రశ్నించారు..

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.. బాధిత రైతుకు న్యాయం చేయాలి..

ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులపై కేసు నమోదు చేయాలని బాధితులు దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు.. ప్రమాదానికి కారణమైన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులెవరో గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.. అలాగే, పాడి గేదెను కోల్పోయిన రైతు చిన్నారెడ్డికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.. ఇకనైనా దుండిగల్ సర్కిల్ మున్సిపల్ అధికారులు స్పందించి సింహపూరి కాలనీలోని వీధి దీపాల విద్యుత్ తీగలను పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న తీగలను వెంటనే సరిచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.. ఒక పాడి గేదె ప్రాణం పోయిన తర్వాత కూడా అధికార యంత్రాంగం స్పందించకపోతే, ప్రజల భద్రత ఉంటుందా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## మా పరిధిలోకి రాదు.. చేతులెత్తేసిన విద్యుత్ అధికారులు..?

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, గేదె యజమాని సంబంధిత విద్యుత్ అధికారులకు విషయాన్ని చేరవేసినట్లు స్థానికుల సమాచారం.. అయితే, తెగిపడిన తీగ తమ శాఖకు సంబంధించింది కాదని, దుండిగల్ మున్సిపాలిటీ వీధి దీపాలకు సంబంధించినదని విద్యుత్ అధికారులు చెప్పినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.. సమస్యను పరిష్కరించే బాధ్యత తమది కాదన్నట్లుగా వ్యవహరించడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.. విద్యుత్ తీగ ఏ శాఖ పరిధిలో ఉన్నప్పటికీ, ప్రజలకు, మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉన్నప్పుడు తక్షణమే స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత లేదా..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు..

## లిగేదె స్థానంలో మనిషి ఉంటే పరిస్థితి ఏమిటి?

ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పాడి గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందిందంటే..! అదే ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉన్నప్పుడు, చిన్నారులు, వృద్ధులు లేదా స్థానికులు అటుగా వెళ్తే ప్రమాదం ఏ స్థాయిలో ఉండేదో అధికారులు ఆలోచించాలని కృష్ణారెడ్డి అన్నారు.. గేదె స్థానంలో మనిషులకు ఇదే పరిస్థితి నెలకొంటె, అధికారులు ఇదే నిర్లక్ష్యం వహిస్తారా అంటూ కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అధికారుల కనీస బాధ్యతగా స్థానికులు పేర్కొంటున్నారు.. వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ తీగల భద్రతపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడమే ఇటువంటి ప్రమాదాలకు కారణమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.. ప్రమాదం జరిగిన తర్వాత కూడా బాధిత కుటుంబానికి భరోసా కల్పించకపోవడం, మృతిచెందిన పశువును తొలగించేందుకు సిబ్బంది స్పందించలేదన్న ఆరోపణలు మున్సిపల్ యంత్రాంగం పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి..

# తుది జాబితాలో మరో 83 లక్షల ఓట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో భాగంగా నోటీసుల విచారణలో ఇప్పటివరకు 83,03,355 మంది ఓటరు జాబితాకు అర్హత సాధించారు. 30,407 మంది ఓటర్లు సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో వారు తుది జాబితాలో ఉండడానికి అనర్హులుగా గుర్తించారు. ఇందులో అనామలీస్ విభాగంలో 12,718 మంది, అన్-మ్యాపింగ్ విభాగంలో 17,689 మంది ఉన్నారు. విచారణ ప్రక్రియకు మరో 15 రోజుల గడువు మాత్రమే ఉంది. నవంబరు 5తో నోటీసు దశ ముగియగానే 9న ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తారు.

రాష్ట్రంలో 'సర్' ఓటర్ల ముసాయిదా జాబితా అనంతరం మొత్తం 92,88,188 మందికి నోటీసులను అందించారు. ఇందులో 92,65,731 మందికి ఇప్పటి వరకు నోటీసులు అందాయి. ఇంకా 22,457 మందికి నోటీసులు జారీ చేయాల్సి ఉంది. నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటి వరకు అనామలీస్ విభాగంలో 56,86,890 మంది, అన్-మ్యాపింగ్ విభాగంలో 26,16,465 మంది ధ్రువపత్రాలు సమర్పించి తుది ఓటర్ల జాబితాలో స్థానం సంపాదించారు. నోటీసులు అందుకున్న మరో 9.6 లక్షల మంది ఓట్లు పరిశీలనలో ఉన్నాయి. ముసాయిదా ఓటరు జాబితా రోజు అన్ని సక్రమంగా ఉన్న ఓటర్లు 1,66,81,849 మంది ఉన్నారు. ఈ ఓటర్లు, ఇప్పటి వరకు నోటీసులకు సమాధానం ఇచ్చి అర్హత సాధించిన ఓటర్లను కలుపుకొంటే తుది జాబితాలోకి 2,49,85,204 అర్హత సాధించారు.

**అత్యధికంగా రంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాల పరిధిలో..**

నోటీసులు అందుకున్న ఓటర్లలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో తమ ఓటును కోల్పోయారు. ఈ జిల్లా పరిధిలో మొత్తం 8,208 మంది సరైన ధ్రువపత్రాలు సమర్పించకపోవడంతో తొలగింపు జాబితాలో ఉంచారు. తర్వాత ఎక్కువగా పెద్దపల్లి జిల్లాలో 4,424 మంది ఓట్లను అనర్హత జాబితాలో ఉంచారు. అతి తక్కువగా ఆదిలాబాద్‌లో 71 మందిని, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 167 మంది ఓట్లను తొలగించనున్నారు.



# అవినీతి అధికారులకు ఇక చెక్.. ఏసీబీకి సుప్రీంకోర్టు తీర్పుతో బలం!

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు కీలక మార్పులకు దారితీయనుంది. లంచం తీసుకోవడం వంటి అవినీతి ఆరోపణలపై ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకునే విషయంలో ఉన్న అడ్డంకులు తొలగే అవకాశం ఏర్పడింది. దీంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణకు మార్గం సుగమం కానుంది.

### అనుమతుల కోసం ఎదురుచూపులు

ఇప్పటివరకు అవినీతి కేసుల్లో ఏసీబీ దర్యాప్తు పూర్తయినా, న్యాయస్థానంలో అభియోగాలు నమోదు చేసే దశలో ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ ప్రక్రియలో జాప్యం కారణంగా అనేక కేసులు ముందుకు సాగకపోగా, కొందరు నిందితులపై విచారణ కూడా ఆలస్యమవుతోంది.ఒక అధికారిపై విచారణకు అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఏకంగా 19 సార్లు లేఖలు రాసినా అనుమతి లభించని ఉదంతం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, గతంలో వందలాది కేసుల్లో ప్రాసిక్యూషన్ అనుమతులు పెండింగ్‌లో ఉండగా, కొన్ని కేసులకు మాత్రమే అనుమతులు లభించాయి. శాఖాపరమైన చర్యలు తీసుకున్నామనే కారణంతో న్యాయవిచారణకు అనుమతి నిరాకరించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

### సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

రాజస్థాన్‌కు చెందిన పోలీసు కానిస్టేబుల్ తేజారామ్ కేసులో సుప్రీంకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగి అధికారిక విధుల్లో తీసుకున్న నిర్ణయాలు లేదా చేసిన సిఫార్సులకు సంబంధించి దర్యాప్తు చేపట్టే సందర్భాల్లో ముందస్తు అనుమతి నిబంధన వర్తిస్తుందని వివరించింది. అయితే లంచం తీసుకోవడం వంటి అవినీతి చర్యలకు ఈ రక్షణ వర్తించదని స్పష్టం చేసింది.

### పెండింగ్ కేసులకు కదలిక వచ్చేనా?

ఈ తీర్పుతో లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగులు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో తదుపరి చర్యలకు ఊతం లభించే అవకాశం ఉంది. అయితే ప్రతి కేసులోని ఆరోపణలు, వర్తించే చట్ట నిబంధనలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు స్పష్టతతో ఏసీబీ దర్యాప్తులు, న్యాయప్రక్రియ మరింత వేగవంతమవుతాయా అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

## జవహర్ నగర్ లో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు



హైదరాబాద్ పెన్ పవర్: మేడ్చల్ మల్కాజ్ గిరి,కిసర సర్కిల్,జవహర్ నగర్ సిల్వర్ సీ లైన్ లో ఉప్పలమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో కొండల్ ముదిరాజ్,గొడుగు వేణు,రెడ్డి శెట్టి మహేష్,ఆలూరి సంగీత రాజశేఖర్,బండి నవీన్ గౌడ్, ఆలయ అధ్యక్షులు మామిళ్ళ హరీష్,కమిటీ సభ్యులు డి. మధు,హరిబాబు గౌడ్,టి. యాదగిరి గౌడ్,పుట్ట కన్నా రెడ్డి, బి. సురేష్,గణేష్,ఏ.అనిల్, సతీష్ గౌడ్,పి.అనిల్,జమాల్ పూర్ శివ,టి.అనిల్,ఆర్. శ్రీనివాస్ గౌడ్,ఆర్. ప్రవీణ్ గౌడ్, జి.ప్రవీణ్ గౌడ్,కె.పవన్ గౌడ్, అజయ్ రెడ్డి,డి.అభిషేక్,ఆర్. నవీన్ గౌడ్,శివ గౌడ్,డి.మురళి, టింకు మరియు అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దసరా వేళ వామనులకు కొత్త బట్టల పంపిణీ..ఆగం పాండు ముదిరాజ్ సేవాభావం......

ఉత్సవాల్లో కళాకారులకు ప్రోత్సాహం.. ఆర్థిక సహకారంతో అండగా నిలుస్తున్న మాజీ సర్పంచ్



హైదరాబాద్ పెన్ పవర్: పండుగల ఆనందం అందరికీ అందాలనే సంకల్పంతో బాచుపల్లి మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా వామనులు (మరగుజ్జు ) లకు ,అంతేకాకుండా వారికి చేదోడు వాదోడుగా నిలుస్తున్న యువతకు కొత్త బట్టలు పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పండుగ వేళ వారితో ఆనందాన్ని పంచుకుంటూ మానవత్వం, సోదరభావం, సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలిచారు.కేవలం పండుగల సమయంలోనే కాకుండా, తాను నిర్వహించే గణేశ్ ఉత్సవాలతో పాటు ఇతర పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వామనులకు పాల్గొనే అవకాశాలు కల్పిస్తూ వారిలోని కళా ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. ఉత్సవాల్లో ఆడి పాడేందుకు అవకాశం కల్పించడంతో పాటు ఆర్థిక సహాయం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు.సమాజంలో ప్రతి ఒక్కరికీ గౌరవం, సమాన అవకాశాలు లభించాలనే భావనతో ఆగం పాండు ముదిరాజ్ చేస్తున్న ఈ ప్రయత్నాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. సేవా కార్యక్రమాల ద్వారా పండుగల సంతోషాన్ని అందరితో పంచుకుంటూ, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యత ఇస్తున్న ఆయన తీరు ఆదర్శనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.పండుగ అంటే సంబరాలే కాదు.. నలుగురి ముఖాల్లో చిరునవ్వులు నింపడం కూడా! ఆగం పాండు ముదిరాజ్ చేపడుతున్న ఈ సేవా కార్యక్రమం ఆ సందేశాన్ని చాటిచెబుతోంది.

## కుసంగిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- టేక్మాల్ తహసీల్దార్ తులసి రామ్ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ ల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



హైదరాబాద్ పెన్ పవర్: ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, నకిలీ రేషన్ కార్డులకు చెక్ పెట్టే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులను భద్రత ప్రమాణాలతో తయారు చేశారని టేక్మాల్ మండల తహసీల్దార్ తులసి రామ్ అన్నారు. సోమవారం నాడు టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామంలో స్థానిక గ్రామపంచాయతీ వద్ద మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, కుసంగి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ తో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డులను తయారు చేసిందని అనేక రకాల భద్రత ప్రమాణాలతో ఈ యొక్క కార్డును రూపొందించారని అన్నారు.ఈ యొక్క కార్డులు రేషన్ సరుకులకు మాత్రమే కాకుండా అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ నాయకులు సీనియర్ నాయకులు, క్రికెట్ కోచ్ భగవాన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మొగుల్ రెడ్డి, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ విక్రమ్ గౌడ్, డాకూరి లక్ష్మయ్య, ఫక్రోద్దీన్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు ముత్యంగారి వెంకయ్య, అనిల్ గౌడ్, వెంకట్ గౌడ్ రెవెన్యూ సిబ్బంది గ్రామ మహిళలు లబ్ధిదారులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ భద్రకాళి అమ్మవారిని ఈరోజు మహిషాసుర వర్ధినిగా అలంకరణ



హైదరాబాద్ పెన్ పవర్: శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారిని మహిషాసురమర్ధిని. గా అలంకరించి పూజానాధలు నిర్వహించారు. వరాహ పురాణాన్ని అనుసరించి సిద్ధిధాత్రి దుర్గాక్రమంలో బోధాయనోక్త నవరాత్ర కల్పాన్ననుసరించి శుంభహా దుర్గా క్రమంలోనూ అమ్మవారికి పూజారాధనలు జరిపారు. ఉదయం వసంతోత్సవం చతురస్తసేవ, సాయంకాలం విమానక సేవ (సర్వభూపాల వాహనసేవ) అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అనేక మంది భక్తులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రేపు ఉదయం నవరాత్ర మహోత్సవముల పూర్ణాహుతి నిర్వహించబడుతుంది. ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా గోవా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ విశ్వజిత్ రాణే మరియు శ్రీమతి దేవ్యా రాణె, ఎం. ఎల్.ఏ గోవా, ఐశ్వర్య రాణే, అరుంధతి రాణె మరియు కరీంనగర్ వాస్తవ్యులు శ్రీ యాదా సత్యదీప్-ప్రవళిక దంపతులు, యాదా రూహి తదితరులున్నారు.ఈ రోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో తెలంగాణా రాష్ట్ర ఫిషరీస్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీ మెట్టు సాయి తదితరులున్నారు. పూజానంతరం ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు మహదాశీర్వచనం నిర్వహించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు శ్రీ కమటం వేణుగోపాల్, శ్రీ గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, శ్రీమతి మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, శ్రీమతి చిదర అంజనీదేవి, శ్రీ కల్లూరి పవన్ కుమార్, శ్రీ కారెంగుల సురేష్ బాబు, శ్రీ మాడిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయదశమి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు

హైదరాబాద్ పెన్ పవర్:

అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

పొన్నాల వెంకటేశ్వర్లు పి.ఎస్.సి.ఎస్. మాజీ చైర్మన్ విజయదశమి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ పొన్నాల వెంకటేశ్వర్లు పి.ఎస్.సి.ఎస్. మాజీ చైర్మన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం పెంపొందాలని కోరుకున్నారు.

అర్హులైన పట్టభద్రులు అవసరమైన పత్రాలతో ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పత్రాలు: డిగ్రీ మెమో,పదో తరగతి మెమో,ఆధార్



కార్డు,ఓటర్ ఐడీ వివరాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సద్దుల బతుకమ్మను వీక్షించిన ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు



హైదరాబాద్ పెన్ పవర్: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా జాతీయ బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి యాదగిరి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన బతుకమ్మ ఆకట్టుకుంది. నరసింహస్వామి తోరణంతో పాటు కొల్హాపూర్ శ్రీ అంబాభవానీ మహాలక్ష్మి మాత, తుల్జాపూర్ తుల్జాభవాని మాత అవతారాలను ప్రతిబింబించేలా కిరీటంతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకర్షించింది. సంప్రదాయ బతుకమ్మకు ఆధ్యాత్మిక శోభను జోడించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ బతుకమ్మనుజుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఇమ్రోజ్ సొసైటీ డైరెక్టర్ కుమ్మరి యాదమ్మ చిన్న రాములు, తదితరులు పాల్గొన్నారు.

## కోరంపల్లి రంగమ్మ గారి అంత్యక్రియలలో పాల్గొన్న ఎమ్మెల్యే. సంజీవరెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:

ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలంలోని కోరంపల్లి గ్రామంలో నారాయణఖేడ్ పీర్ డి ఈ గా విధులు నిర్వహిస్తున్న కోరంపల్లి గ్రామానికి చెందిన సందూరి మధుసూదన్ రెడ్డి గారి తల్లి రంగమ్మ గారు అనారోగ్యం చేత మృతి చెందారు. వారి అంత్యక్రియలకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మరియు సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. మధుసూదన్ రెడ్డి తల్లి రంగమ్మ మరణానికి ఎమ్మెల్యే తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. వీరితోపాటు వివిధ శాఖల అధికారులు మరియు టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నిమ్మ రమేష్ గారు, జోగిపేట మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సత్యనారాయణ గారు ,సుబేదార్ మాణికిషన్ గారు, మెదక్ జిల్లా ఆర్టిఏ మేంబర్ మల్లారెడ్డి గారు, కిషన్ రెడ్డి , గిరి ద వర్ మాధవరెడ్డి, కోరంపల్లి గ్రామ సర్పంచ్ ప్రసన్న వినీత్ కుమార్, ఉప సర్పంచ్ నాగరాజు ,మాజీ సర్పంచ్ సత్తెమ్మ విఠల్, పరమేశ్వర్,వార్డు మెంబర్లు మరియు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## సినీ దర్శకుడు తుకారంకు ఘన సన్మానం





హైదరాబాద్ పెన్ పవర్: దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా స్వగ్రామమైన కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రానికి విచ్చేసిన కాగితం పడవలు సినిమా దర్శకుడు తుకారంను శాంతినగర్ కాలనీలో కుమ్మరి శాలివాహణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దర్శకుడు తుకారంను శాలువాతో సత్కరించి, సాదరంగా ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుర్రం రాకేష్ రెడ్డి



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 19:** ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నత విద్యావంతుడు గుర్రం రాకేష్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ బాధ్యతలు దక్కడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఆశీస్సులతో రాకేష్ రెడ్డి ఈ పదవికి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేస్త,యువతలో ఉన్న శక్తిని ప్రజాసేవకు మళ్లించి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే నిజమైన నాయకత్వానికి గుర్తింపు లభిస్తుందిఅని పేర్కొన్నారు. యువతను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజల సమస్యలపై స్పందిస్తూ యువతకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో యూత్ కాంగ్రెస్ మరింత బలోపేతమై, రానున్న రోజుల్లో ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా హుస్సేన్




**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 19:** ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా హుస్సేన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పాలేరు నియోజకవర్గ క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబురి దయాకర్ రెడ్డికి, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబుకి, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిషోర్ కుమార్ కి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, పెద్దలకు, మిత్రులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకంతో ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ప్రతిఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. మైనార్టీల సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి నా వంతు కృషి చేస్తాను. అందరినీ కలుపుకొని సంఘాన్ని బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటాను. నాకు సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మిత్రులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమం, ఐక్యత, అభివృద్ధి లక్ష్యంగా అందరి సహకారంతో ముందుకు సాగుతానని హుస్సేన్ స్పష్టం చేశారు.

## పి.ఆర్.టి.యు రాష్ట్ర కార్యదర్శిగా నాళం వెంకటేశ్వర్లు



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 19:** పి.ఆర్.టి.యు రాష్ట్ర కార్యదర్శిగా నాళం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నల్గొండలో నిర్వహించిన పి ఆర్ టి యు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని ఎం పి పి ఎస్ కట్టకొమ్ము తండ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నాళం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘంలో సీనియర్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు రాష్ట్రస్థాయి బాధ్యతలు లభించడం పట్ల పి ఆర్ టి యు ఖమ్మం జిల్లా శాఖ, నేలకొండపల్లి మండల శాఖ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఉపాధ్యాయులు నాళం వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలియజేస్తూ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన ఎన్నిక ఉపాధ్యాయ సంఘానికి సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఆయన తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణికి 33 ఫిర్యాదులు



**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్ (అక్టోబర్ 19):** రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (33) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవికి విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శారదా దేవి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-- 22 , ఇతర శాఖలు - 11, మొత్తం 33 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా శుభాకాంక్షలు తెలిపిన కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి



**ఎల్బీనగర్, పెన్ పవర్ అక్టోబర్ 19:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో, ఆనందంగా ఉండాలని కోరుకుంటూ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఖైరతాబాద్ లిట్మస్ టెస్ట్

**హైదరాబాద్,అక్టోబరు 19 పెన్ పవర్:**
రాజకీయం ఎపుడూ ఒకేలా ఉండదు. అది మారుతూ ఉంటుంది. ప్రజాభిప్రాయం నిరంతరం గతులు మార్చుకుంటుంది. 2023లో కేసీఆర్ ఓడిపోగానే ఆయన పని అయిపోయింది అని అన్న వారు ఉన్నారు.2024 లో లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి ఒక్క పార్లమెంట్ సీటు కూడా రాలేదు, ఆ తరువాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రెండు ఎమ్మెల్యే సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ కి చేదుఅనుభవాలు ఎదురయ్యాయి. కానీ అది నిజం కాదని తాజాగా ఖైరతాబాద్ లో ఒక ప్రముఖ సర్వే సంస్థ ఆర్ఆర్ నిర్వహించిన దాంట్లో తేలింది. ఇందులో విశ్లేషణలు చూస్తే కనుక బీఆర్ఎస్ దే మరోసారితెలంగాణాలో అధికారం అన్నది తేలుతోంది. లిట్మస్ టెస్ట్ గా రేపు జరగబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికల ఫలితం ఉండబోతోంది అని ఈ సర్వే స్పష్టం చేసింది. తరువాత సీఎం ఆయనే : ఖైరతాబాద్ ఉపఎన్నికల గురించి జనాభిప్రాయాన్ని ఆర్ ఆర్ సర్వే చాలా లోతుల్లోకి వెళ్ళి రాబట్టింది. దానిలో కేసీఆర్ పాలన గురించి జనాలను ప్రశ్నించినపుడు అత్యధిక శాతం ఆయన హయాంలో బాగుంది అని చెప్పారు.అంతే కాదు 2028 లో జరిగే ఎన్నికల్లో సీఎం ఎవరు అంటే కేసీఆర్ అని ఏకంగా 53.84 శాతం మంది ఓటేశారు. ఇక ప్రస్తుతం సీఎం గా ఉన్న రేవంత్ రెడ్డికి 20.87 శాతం మద్దతు తెలిపితే బీజేపీ ఫైర్ బ్రాండ్,కేంద్ర మంత్రి బండి సంజయ్ తదుపరి సీఎం అంటూ కేవలం 14.30 మంది చెప్పారు. మరో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డికి 4.39 శాతం లభించింది. ఈ సర్వే ప్రకారం చూస్తే కనుక అందరి కంటే చాలాదూరంలోనే కేసీఆర్ నిలిచి తెలంగాణా ప్రజల అభిమానం అందుకున్నారు అని అర్థం అవుతోంది. అంతే కాదు కేసీఆర్ పరిపాలన ఉత్తమంగా ఉందని, అభివృద్ధి సంక్షేమం ఆయన హయాంలోనే బాగా జరిగాయని ఖైరతాబాద్ జనాలు బల్ల గుద్ది మరీ చెప్పారు. ఆర్ఆర్ సర్వే ప్రకారం చూస్తే రెండు సార్లు సీఎం గా చేసిన కేసీఆర్ కి మద్దతుగా 57.14 శాతం మంది నిలిచారు. అదే సమయంలో రేవంత్ రెడ్డిరెండున్నరేళ్ళ పాలన బాగుందని 21.97 శాతం మంది మాత్రమే మద్దతు ఇవ్వడం విశేషం. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం తాము చెప్పుకుంటున్నట్లుగా తెలంగాణాలో అభివృద్ధి సంక్షేమం పట్ల జనం అంతసంతృప్తిగా లేరు అన్నది రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఒక కీలక నియోజకవర్గం. రాజకీయంగా చైతన్యవంతమైన ఖైరతాబాద్ లో ఓటర్ల మనోభావాలు తెలియచేశాయని అంటున్నారు. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఎన్నికల హామీల అమలుతో సక్రమంగా పనిచేసింది అని ఆర్ఆర్ సర్వే ప్రకారం జనాలు కితాబు ఇస్తున్నారు. బీఆర్ ఎస్ సర్కార్ ఇచ్చిన మాట మేరకు హామీలునెరవేర్చింది అని 54.94 శాతం మంది చెబుతూ జై కొట్టారు. అదే కాంగ్రెస్ ఎన్నికల హామీల విషయంలో అంత కచ్చితంగా అమలు చేయడం లేదన్న భావనలో జనాలు ఉన్నారనడానికి ఆ పార్టీకి 19.78శాతం ప్రజల మద్దతు దక్కడం ఒక ఉదాహరణగా చూడాలని అంటున్నారు. లిట్మస్ టెస్ట్ అంటే అన్నంలో ఒక మెతుకుని పట్టడం లాంటిది. ఖైరతాబాద్ లో ఉప ఎన్నికలు జరగలేదు. జనం మూడ్ ఇదీ అనిఆర్ఆర్ సర్వే తన నివేదిక బయటపెట్టింది. దాని ప్రకారం చూస్తే అక్కడ ఉప ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ అభ్యర్థి గెలుస్తారు అని 36.89 శాతం ఓటు షేర్ దక్కుతుందని ఈ సర్వే వెల్లడిస్తోంది. అదే కాంగ్రెస్ కి 34.78 శాతం ఓటు షేర్ దక్కి రెండో ప్లేస్ లో ఉంటుందని తేటతెల్లం చేసింది. ఇవన్నీ పక్కన పెడితే గత రెండున్నరేళ్ల బట్టి కేసీఆర్ అయితే జనంలో లేరు, ఆయన పెద్దగా సభలు సమావేశాలు కూడానిర్వహించలేదు. కానీ ఆయన తదుపరి సీఎం అని జనాలు అంటున్నారు. అలాగే బీఆర్ ఎస్ హామీలు బాగా నెరవేర్చింది అని సమర్థిస్తున్నారు. సరికొత్త రాజకీయ సరళిగా : బీఆర్ఎస్ పాలన బెస్ట్ అనిప్రశంసిస్తున్నారు. మరి ఎన్నికల ముందు కనుక కేసీఆర్ జనంలోకి వచ్చి ప్రచారం చేస్తే ఇంకా ఈ సానుకూలత పెరుగుతుందని అంటున్నారు. ఏది ఏమైనా ఆర్ ఆర్ సర్వే అయితే జనం నాడిని పట్టుకుంది అని అంటున్నారు. అధికార పార్టీలకు యాంటీ ఇంకెంబెన్సీ అన్నది పెరగడం ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా ఒక సరికొత్త రాజకీయ సరళిగా ఉంది. ఒక అయిదేళ్లకు మాత్రమే ప్రభుత్వాన్ని జనాలుఎన్నుకుంటున్నారు. రెండోసారి చాన్స్ ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు, అది తమిళనాడులో ఇటీవల ఎన్నికల్లో వెల్లడైంది. ఏపీలో వరుస మూడు ఎన్నికల్లో అలాగే జరిగింది. రేపటి ఎన్నికల్లో తెలంగాణాలోఅదే జరుగుతుందా అంటే ఆర్ఆర్ సర్వే ప్రకారం చూస్తే అవును అన్న మాట వస్తోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# సింగరేణి చుట్టూ రాజకీయాలు




**హైదరాబాద్,అక్టోబరు 19 పెన్ పవర్:**
సింగరేణి చుట్టూ రాజకీయాలు వేడెక్కాయి. సింగరేణిని దెబ్బతీస్తున్నారంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య విమర్శల పర్వం కొనసాగుతోంది. సింగరేణిలో నెలకొన్న నష్టాలకు, ప్రస్తుతదుస్థితికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తుండగా... ప్రభుత్వ వైఫల్యాలే సింగరేణి దుస్థితికి కారణమని కేటీఆర్ విమర్శిస్తున్నారు. సుమారు 3,000 కోట్లరూపాయల బొగ్గు దిగుమతి కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అయితే సింగరేణి అంశంపై ఎలాంటి విచారణకైనా సిద్ధమని సీఎం రేవంత్ సవాల్ విసిరారు.సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవడం, విదేశీబొగ్గును దిగుమతి చేసుకుంటూ ఉండడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కోసం గ్రేడ్-9 బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై సీబీఐ, ఈడీ లేదా ఐటీ విభాగాలతో స్వతంత్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు దిగుమతుల వల్ల సుమారు 3,000 కోట్ల రూపాయల కుంభకోణంజరిగే అవకాశం ఉందని చెప్పారు. లాజిస్టిక్స్, ప్రొక్యూర్‌మెంట్ డెసిషన్స్‌లో భారీగా కమిషన్లు చేతులు మారుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. అంతేకాకుండా, గతంలో సింగరేణి ద్వారా సరఫరా కావాల్సినబొగ్గును క్రమంగా తగ్గించి, విదేశీ దిగుమతుల వైపు మొగ్గు చూపేలా ప్లాన్ చేసారని ఆయన మండిపడ్డారు. సింగరేణి ఉత్పత్తి 2023-24లో సుమారు 70.02 మిలియన్ టన్నుల నుంచి 2025-26 నాటికి58 మిలియన్ టన్నులకు పడిపోయిందని, సంస్థ రావాల్సిన బకాయిలు, చెల్లింపులపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కేటీఆర్ ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగాస్పందించారు. విదేశీ బొగ్గు దిగుమతి వ్యవహారంపై ఏ దర్యాప్తు సంస్థతోనైనా విచారణ జరిపించడానికి ప్రభుత్వం సిద్ధమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే యాదాద్రి ప్లాంట్‌కోసం విదేశాల నుంచి గ్రేడ్-9 బొగ్గును దిగుమతి చేసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆయన ఆధారాలతో సహా వివరించారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల సింగరేణి సంస్థను క్రమంగా పక్కనబెట్టి, కొందరికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. యాదాద్రి ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి వ్యయం ఇతర కేంద్రాలతో పోలిస్తే భారీగా పెరిగిందని, దీనివల్ల ప్రజలపైఅదనపు భారం పడుతోందని ప్రభుత్వం పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలు, అప్పట్లో ఎన్జీటీలో దాఖలైన పిటిషన్లు అన్నీ సింగరేణికి నష్టం కలిగించేలా ఉన్నాయని కాంగ్రెస్ నేతలువిమర్శిస్తున్నారు.సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిది. ఇటువంటి కంపెనీపై అధికార, ప్రతిపక్షాల మధ్య జరుగుతున్న ఈ రాజకీయ పోరు సంస్థ ఉనికిని, కార్మికుల భవిష్యత్తునుప్రశ్నార్థకం చేస్తోంది. బొగ్గు దిగుమతులు, ఉత్పత్తి పడిపోవడం, అంచనా వ్యయాల పెంపు వంటి అంశాలపై రెండు పార్టీలు పరస్పరం అవినీతి ఆరోపణలు గుప్పించుకోవడం రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారితీసింది. ఈ వివాదానికి తెరపడాలంటే సమగ్రమైన నిష్పాక్షిక విచారణ జరిగి, వాస్తవాలు ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది

# కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎమ్మెల్సీ పోరు

**హైదరాబాద్,అక్టోబరు 19 పెన్ పవర్:**
తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కసరత్తును ముమ్మరం చేసింది. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఇప్పుడు ఓటర్ల నమోదు,క్షేత్రస్థాయి సమన్వయంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా 77 మంది సమన్వయకర్తలను నియమించింది. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఈ మేరకు బాధ్యతలను అప్పగించారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగాతీసుకుంది. ఇప్పటికే రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం.. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేసింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం నుంచి సామ రామ్మోహన్ రెడ్డి, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానం నుంచి రామరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ బరిలోకి దింపుతోంది.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఓటర్ల జాబితాలో అర్హులైనపట్టభద్రుల పేర్ల నమోదుపై ప్రధానంగా దృష్టి సారించింది. పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నాయకత్వంసూచించింది.రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికల సన్నద్ధతను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 43మందిని, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గానికి 34 మందిని సమన్వయకర్తలుగా నియమించింది. ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో వారికి బాధ్యతలు అప్పగించగా, ఇతరప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలకు బాధ్యతలు కేటాయించారు.కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసోదరుడు అనుముల తిరుపతి రెడ్డికి అప్పగించడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. నియోజకవర్గాల వారీగా నేతలంతా సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పీసీసీనాయకత్వం స్పష్టం చేసింది.మరోవైపు, ఢిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల సమన్వయంవంటి అంశాలపై చర్చించారు.రెండు స్థానాల్లోనూ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం, పీసీసీ అధ్యక్షుడు నేతలకు సూచించినట్లు సమాచారం. ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్లక్ష్యంచేయకుండా, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.ఈ ఎన్నికల్లో ఓటర్ల జాబితా కీలకంగా మారనుంది. తెలంగాణలోని రెండు గ్రాడ్యుయేట్ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాను కొత్తగా సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే పాత జాబితాలో పేర్లు ఉన్నవారుకూడా కొత్త జాబితాలో చోటు కోసం మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. 2026 నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబర్ 25నముసాయిదా ఓటర్ల జాబితా, డిసెంబర్ 30న తుది జాబితా ప్రకటించనున్నారు. ప్రస్తుత సభ్యుల పదవీకాలం 2027 మార్చిలో ముగియనున్న నేపథ్యంలో, వచ్చే ఏడాది మార్చిలో ద్వైవార్షిక ఎన్నికలుజరిగే అవకాశం ఉంది. అయితే, పోలింగ్ తేదీలను ఎన్నికల సంఘం విడిగా ప్రకటించాల్సి ఉంది.అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు రాజకీయంగా కీలకంగా మారాయి.అభ్యర్థుల ఎంపిక నుంచి సమన్వయకర్తల నియామకం వరకు వేగంగా అడుగులు వేస్తున్న పార్టీ.. ఇప్పుడు పట్టభద్రుల మద్దతును కూడగట్టడంపై దృష్టి సారించింది. ఓటర్ల నమోదు ప్రక్రియను ఎంతసమర్థంగా నిర్వహిస్తారు? క్షేత్రస్థాయిలో నేతలంతా ఎంత సమన్వయంతో పనిచేస్తారు? అన్న అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ప్రపంచబ్యాంక్, ఏడీబీ మెచ్చిన అమరావతి పురోగతి

**విజయవాడ ,అక్టోబరు 19 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో మరో చారిత్రాత్మక ఘట్టం చోటుచేసుకోబోతోంది. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న పనుల వేగం, కార్మికుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ , ఆధునికమౌలిక వసతుల కల్పనపై ప్రపంచబ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ సంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రణాళికాబద్ధమైన నగరాల నిర్మాణంలో అమరావతి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక స్థానాన్నిదక్కించుకోనుందని ఈ అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ప్రతినిధులు ప్రశంసించారు. రాజధాని నిర్మాణం నిధుల కొరత లేకుండా వేగంగా ముందుకు సాగేలా, ఏపీ సీఆర్డీఏ కోరిన మరో రూ. 15,000 కోట్లఅదనపు రుణ ప్రతిపాదనలకు ఈ బ్యాంకులు పచ్చజెండా ఊపాయి.ప్రస్తుతం అమరావతిలో రూ. 52,000 కోట్ల అంచనా వ్యయంతో 102 రకాల కీలక పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికేకేటాయించిన నిధులకు అదనంగా మరో రూ. 15,000 కోట్లు అందనుండటంతో హైకోర్టు, అసెంబ్లీ భవనాలు, సచివాలయ ప్రాజెక్టులు, ఐకానిక్ నిర్మాణాలు , ఉద్యోగుల గృహసముదాయాల నిర్మాణాల్లోమరింత పురోగతి రానుంది. ప్రపంచ బ్యాంక్ బృందం ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నాణ్యతను, నిర్దేశిత గడువు ప్రకారం సాగుతున్న తీరును సమీక్షించిన అనంతరం ఈ అదనపు నిధులమంజూరుకు సుముఖత వ్యక్తం చేయడం పనుల పారదర్శకతకు నిదర్శనంగా నిలిచింది.కేవలం భవనాల నిర్మాణమే కాకుండా, రాబోయే తరాలకు అనుగుణంగా గ్రీన్ అండ్ క్లైమేట్-రెసిలెంట్



నగరంగాఅమరావతిని రూపుదిద్దుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఉపయోగిస్తూ, డ్రైనేజీ వ్యవస్థ, ఫ్లడ్ మేనేజ్‌మెంట్ మరియు స్మార్ట్ లాజిస్టిక్స్ కారిడార్లను ప్రాధాన్యతా ప్రాతిపదికన
అభివృద్ధి చేస్తున్నారు. నూతనంగా సమకూరే నిధుల నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌ను నియమించేందుకు సీఆర్డీఏ సన్నాహాలు చేస్తోందిఈ భారీ అంతర్జాతీయనిధుల ప్రవాహంతో అమరావతికి మౌలిక సదుపాయాలే కాకుండా, అంతర్జాతీయ పెట్టుబడులు, పారిశ్రామిక పురోగతి , ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతోనిర్మాణం జరుపుకుంటున్న అమరావతి, ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ ఫీల్డ్ ప్లాన్డ్ సిటీల్లో ఒకటిగా నిలిచే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.

# కర్నూలు మేయర్ పీఠం కోసం అత్తాకోడళ్ల పోటీ..

**కర్నూలు,అక్టోబరు 19 పెన్ పవర్:**
కర్నూలు రాజకీయాల్లో ఆసక్తికరమైన పోరు తెరపైకి వచ్చింది. మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో వేర్వేరు పార్టీల నుంచి బరిలోకి దిగుతున్న ఇద్దరు మహిళల మధ్య ఉన్న కుటుంబ సంబంధాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఒకరు తెలుగుదేశం పార్టీ తరఫున విజయ ప్రత్యూష కాగా, మరొకరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సుశీల. బంధుత్వం ఒకవైపు.. రాజకీయ ప్రత్యర్థిత్వం మరోవైపు అన్నట్లుగా సాగుతున్న ఈ వ్యవహారం స్థానికంగా ఆసక్తిని పెంచుతోంది.సాధారణంగా ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల మధ్య విమర్శలు, పోటీ సహజమే. అయితే ఒకే కుటుంబానికి చెందినవారు వేర్వేరు పార్టీల తరఫున కీలక పదవుల కోసం పోటీ పడితే ఆ రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారతాయి. కర్నూలు మేయర్ పదవికి సంబంధించి ఇప్పుడు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కుటుంబంలో అత్తాకోడళ్ల వరుసలో ఉన్న ఇద్దరు మహిళలు రాజకీయంగా ఒకరికొకరు ఎదురుగా నిలవడం ఈ పోటీకి ప్రత్యేకతను తీసుకొచ్చింది.తెలుగుదేశం పార్టీ తరఫున ముందుకు వస్తున్న బొల్లెద్దుల విజయ ప్రత్యూషకు గతంలో 52వ వార్డు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఆమె టీడీపీ సీనియర్ నాయకుడు బొల్లెద్దుల రామకృష్ణ కుమార్తె. స్థానిక రాజకీయాలపై అవగాహన, గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం తనకు అనుకూలంగా మారుతాయని ఆమె వర్గం భావిస్తోంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మద్దతు, పార్టీ అధిష్ఠానం ఆశీస్సులు కూడా తన రాజకీయ ప్రయాణానికి బలాన్నిస్తాయని విజయ ప్రత్యూష అనుచరులు ఆశిస్తున్నారు.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సుశీల పేరు చర్చలో ఉంది. ఆమెకు మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ కుటుంబంతో సంబంధాలు ఉండటంతో పాటు, పార్టీ శ్రేణుల మద్దతు తనకు కలిసివస్తుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానికంగా పార్టీకి ఉన్న బలం, నాయకుల సహకారం మేయర్ పదవిని దక్కించుకునే ప్రయత్నంలో కీలకంగా మారవచ్చు. దీంతో ఇరువర్గాల మధ్య పోటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ఇద్దరి మధ్య ఉన్న బంధుత్వమే ఈ వ్యవహారంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. సుశీల కుమారుడిని విజయ ప్రత్యూష సోదరి వివాహం చేసుకుంది. ఈ సంబంధం కారణంగా వీరిద్దరూ అత్తాకోడళ్ల వరుసలోకి వస్తారు. కుటుంబ వేడుకల్లో కలుసుకునే వీరు రాజకీయ వేదికపై ప్రత్యర్థులుగా నిలవాల్సిన పరిస్థితి రావడం స్థానికంగా చర్చలకు దారితీస్తోంది.అయితే మేయర్ పదవిని ఎవరు దక్కించుకుంటారనేది కేవలం కుటుంబ నేపథ్యం లేదా వ్యక్తిగత పరిచయాలపై ఆధారపడి ఉండదు. పార్టీ బలం, కార్పొరేటర్ల మద్దతు, రాజకీయ వ్యూహాలు, ఎన్నికల సమీకరణాలు వంటి అనేక అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి.

**టీడీపీ నుంచి ప్రత్యూష.. వైసీపీ నుంచి సుశీల**

కర్నూలు మేయర్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో టీడీపీ తరఫున బొల్లెద్దుల ప్రత్యూష, వైసీపీ తరఫున ఉతకల్ల సుశీల పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య రాజకీయ ప్రత్యర్థిత్వం ఉన్నప్పటికీ, కుటుంబపరంగా దగ్గరి సంబంధం ఉంది. ప్రత్యూష సోదరి ప్రియాంకను సుశీల కుమారుడు భార్గవ్ వివాహం చేసుకున్నారు. ఈ బంధం కారణంగా సుశీల, ప్రత్యూషకు అత్త అవుతారు. ఇప్పుడు ఒకే కుటుంబానికి చెందిన ఈ ఇద్దరు మహిళలు మేయర్ పీఠం కోసం పోటీ పడుతుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది.ఉతకల్ల సుశీల కుటుంబానికి రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆమె భర్త మణి గాంధీ గతంలో కోడుమూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. సుశీల మామ శిఖామణి కూడా కోడుమూరు నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో సుశీలకు రాజకీయ కుటుంబ నేపథ్యం బలంగా
ఉంది.మరోవైపు, బొల్లెద్దుల ప్రత్యూష కూడా రాజకీయాల్లో అనుభవం ఉన్న నాయకురాలే. కర్నూలు 51వ డివిజన్ నుంచి గత ఐదేళ్లపాటు కార్పొరేటర్‌గా పనిచేశారు. ఆమె తండ్రి రామకృష్ణ మంత్రి టీజీ భరత్‌కు అనుచరుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి మద్దతుతో ప్రత్యూషకు మేయర్ అభ్యర్థిగా అవకాశం లభించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.
అత్త గెలుస్తుందా? కోడలు విజయం సాధిస్తుందా?
ఒకవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ.. రెండు పార్టీల మధ్య పోటీకి కుటుంబ
బంధం మరింత ఆసక్తిని జోడిస్తోంది. రాజకీయ అనుభవం, పార్టీ బలం, కార్పొరేటర్ల మద్దతు వంటి అంశాలు ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి. చివరకు అత్త సుశీల విజయం సాధిస్తారా? లేక కోడలు ప్రత్యూష మేయర్ పీఠాన్ని దక్కించుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. కర్నూలు మేయర్ ఎన్నికల ఫలితం కోసం రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. ప్రజా సమస్యలపై అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత కూడా నాయకుల రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయగలవు.కర్నూలు నగర ప్రజలకు ఈ పోటీ ఆసక్తికరంగా కనిపిస్తున్నప్పటికీ, చివరకు మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనేది రాజకీయ పరిణామాలపైనే ఆధారపడి ఉంటుంది. కుటుంబ బంధాలు ఎన్నికల పోటీని ఎంతవరకు ప్రభావితం చేస్తాయి? పార్టీ విధేయతకు ఓటర్లు ఎంత ప్రాధాన్యం ఇస్తారు? ఈ ప్రశ్నలకు రాబోయే పరిణామాలు సమాధానం చెప్పనున్నాయి. అత్తాకోడళ్లుగా బంధుత్వం కలిగిన ఈ ఇద్దరు మహిళల రాజకీయ పోటీ కర్నూలు రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందో వేచి చూడాలి.

# పక్కా లోకల్.. సౌండ్ చేయని లోకేశ్

**విజయవాడ ,అక్టోబరు 19 పెన్ పవర్:** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల కోలాహలం నెలకొంది. దాదాపు ప్రతి పార్టీల్లోనూ ఒకటే హడావుడి కనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రతిపక్ష నేత జగన్ తోపాటు రాష్ట్రంలో ఇతర నేతలు అంతా రాజకీయ వ్యూహరచనలో మునిగి తేలుతున్నట్లు కథనాలు వస్తున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక సందర్భంలో ఆయా నేతల ప్రమేయంపై మీడియాలోనూ చర్చలు జరుగుతున్నాయి. అయితే రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన మంత్రి లోకేశ్ పాత్ర మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. స్థానిక ఎన్నికల హంగామా మొదలైన నుంచి మంత్రి లోకేశ్ పేరు ఎక్కడా వినిపించడం లేదు. అసలు ఆయనకు స్థానిక రాజకీయాలతో సంబంధం లేదన్నట్లుగానే వ్యవహరిస్తుండటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.
రాష్ట్రంలో స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై దాదాపు వారం కావస్తోంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగియగా, 21వ తేదీ నుంచి జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇలాంటి కీలక సమయంలో అధికార కూటమితోపాటు విపక్షంలోనూ రాజకీయ చర్చలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా కూటమిలో సీట్ల సర్దుబాటుతోపాటు అభ్యర్థుల ఎంపిక, తిరుగుబాటుదారులను బుజ్జగించే ప్రయత్నాలతో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. కొన్నిసార్లు స్థానిక సర్దుబాట్లు కొలిక్కి రాక అధినేతలు చంద్రబాబు, పవన్ జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. అయితే ఇలాంటి కీలక ఎన్నికల్లో మంత్రి లోకేశ్ పాత్రపై ఎలాంటి ప్రస్తావన రాకపోవడమే రాజకీయంగా ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు.కూటమిలోని ప్రధాన పక్షమైన తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటుగా ఉన్న మంత్రి లోకేశ్ మున్సిపల్ ఎన్నికల



చర్చల్లో ఎక్కడా కనిపించకపోవడంపై పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ కు ముందు సీట్ల సర్దుబాటుపై కూటమి పార్టీల మధ్య విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిగినా లోకేశ్ ఏ విషయంలో జోక్యం చేసుకోలేదు. పార్టీ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడును సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించి, మిత్రపక్షాలతో సంప్రదింపుల బాధ్యతను అప్పగించారు. ఇదే సమయంలో పల్లా, నిమ్మల స్థాయిలో పరిష్కారం కాని అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని సర్దుబాటును కొలిక్కి తెచ్చారు.
పార్టీలో కీలక నేతగా ఉన్న లోకేశ్ మాత్రం స్థానిక ఎన్నికల వ్యవహారానికి పూర్తిగా దూరంగా ఉండటమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పార్టీ బాధ్యతలు అన్నీ తన భుజాన వేసుకున్న మంత్రి లోకేశ్.. కీలకమైన ఎన్నికల ప్రక్రియలో అసలు తలదూర్చకపోవడానికి కారణాలు ఏంటి? అన్న చర్చ ఎక్కువగా జరుగుతోంది. అయితే లోకేశ్ జోక్యం చేసుకోకపోవడానికి ఆయన గతంలో చేసిన ఒక ప్రకటన కారణమై ఉండొచ్చునని పరిశీలకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి కూటమి సర్దుబాట్లపై తొందరపాటుతో చేసిన ప్రకటన వల్ల జనసేన, బీజేపీ నాయకులు అంతర్గతంగా తీవ్ర ఇబ్బంది పడ్డారని ఈ కారణం వల్లే ఆయన అనవసర చర్చలకు ఆస్కారం ఇవ్వకూడదనే ఆలోచనతో స్థానిక ఎన్నికల విషయంలో అసలు జోక్యం చేసుకోలేదని అంటున్నారు. అటు పార్టీలోనూ అభ్యర్థుల ఎంపిక విషయంలో స్థానిక నేతలకే పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం వల్ల లోకేశ్ పెద్దగా తలదూర్చాల్సిన అవసరం లేకుండా పోయిందని విశ్లేషిస్తున్నారు. మొత్తానికి కీలక ఎన్నికల సమయంలో మంత్రి లోకేశ్ చర్చ లేకుండా రాజకీయాలు సాగుతుండటమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు.

## ఆక్వా రైతులకు షాక్..

**కర్నూలు,అక్టోబరు 19 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతులకు రొయ్యల మేత కంపెనీలు కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు సరిగ్గా లేక, పెట్టుబడులు రాక ఇబ్బందిపడుతున్న ఆక్వా రంగానికి ఈ మేత ధరల పెంపు ఒక పెద్ద శాపంగా మారింది. నిన్నటి నుంచే అమల్లోకి వచ్చిన ఈ కొత్త ధరల నిర్ణయం పట్ల జిల్లాలోని ఆక్వా రైతులు తీవ్ర ఆందోళన మరియు అసంతృప్తివ్యక్తం చేస్తున్నారు.ఈ తాజా ధరల పెంపు ప్రకారం, వనామీ రొయ్యల మేత కిలోపై ఏకంగా 9.35 రూపాయలు పెంచారు. దీంతో వనామీ మేత టన్ను ధర ఇప్పుడు ఏకంగా 1.20 లక్షల రూపాయలకుచేరుకుంది. అలాగే టైగర్ రొయ్యల మేత కిలోపై 12.87 రూపాయలు పెంచడంతో, దీని టన్ను ధర ఏకంగా 1.38 లక్షల రూపాయల రికార్డు స్థాయికి చేరింది. ఇలా అడ్డూఅదుపూ లేకుండా మేత ధరలుపెరగడం వల్ల ఎకరానికి అయ్యే పెట్టుబడి ఖర్చు ఊహించని విధంగా పెరిగిపోతుందని రైతులు వాపోతున్నారు.జిల్లాలో ఎక్కువ శాతం మంది రైతులు వనామీ, టైగర్ రొయ్యల సాగుపైనే ఆధారపడి
జీవిస్తున్నారు. ఒకవైపు విద్యుత్ ఛార్జీలు, మందుల ఖర్చులు భారంగా మారిన తరుణంలో, ఇప్పుడు మేత ధరలు కూడా ఈ స్థాయిలో పెరగంతో తాము కోలుకోలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈ మేత ధరల పెంపును నియంత్రించాలని, ఆక్వా రంగాన్ని మరియు రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# రాత్రికి రాత్రే పార్టీ మార్పు.. వైసీపీ కండువా!



**పెనుకొండ,అక్టోబరు 19 పెన్ పవర్:** రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం.. పదవి కోసం పార్టీలు మారడం, రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోవడం సర్వసాధారణం. తాజాగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోచోటుచేసుకున్న పరిణామం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. నిన్నటి వరకు తెలుగుదేశం పార్టీలో కొనసాగిన ఓ నాయకుడు.. టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారి, ఏకంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దిగడం చర్చనీయాంశంగా మారింది.పెనుకొండకు చెందిన బోయ శ్రీనివాసులు అలియాస్ జంపు శ్రీను గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. సుమారు మూడుదశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతున్న ఆయన.. పెనుకొండ మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ తరఫున టికెట్ కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ, చివరకు ఆయనకునిరాశ ఎదురైంది.పెనుకొండ మున్సిపల్ చైర్మన్ టీడీపీ అభ్యర్థిగా త్రివేంద్రమూర్తి పేరును ప్రకటించడంతో జంపు శ్రీను అసంతృప్తికి గురయ్యారు. పార్టీలో ఇన్నేళ్లుగా కొనసాగినా తగిన గుర్తింపు, గౌరవంలభించలేదనే భావనతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.టీడీపీలో చైర్మన్ టికెట్ దక్కకపోవడంతో జంపు శ్రీను వైసీపీ నేతలతో సంప్రదింపులు జరిపినట్లుసమాచారం. అనంతరం మాజీ మంత్రి ఉషశ్రీ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీ మారడమే కాకుండా, పెనుకొండ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూడా ఆయన తెరపైకి రావడంస్థానిక రాజకీయాల్లో అనూహ్య పరిణామంగా మారింది. నిన్నటి వరకు టీడీపీలో చైర్మన్ టికెట్ కోసం ప్రయత్నించిన నాయకుడు.. నేడు అదే పదవి కోసం వైసీపీ తరఫున పోటీకి సిద్ధమవడం రాజకీయవర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.జంపు శ్రీను పార్టీ మార్పుతో పెనుకొండ మున్సిపల్ చైర్మన్ పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. టికెట్ కేటాయింపులు, వ్యక్తిగత రాజకీయ ఆశయాలు, పార్టీ నాయకత్వనిర్ణయాలు స్థానిక రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే చర్చ మొదలైంది. అయితే, ఈ పరిణామం ఎన్నికల ఫలితాలపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. నిన్న ఒక పార్టీ నాయకుడు.. నేడు మరో పార్టీ చైర్మన్ అభ్యర్థి! పెనుకొండలో చోటుచేసుకున్న ఈ రాజకీయ మలుపు మరోసారి రాజకీయాల్లో ఏదైనా సాధ్యమేనని చాటుతోంది.

## వేడెక్కిన రాజకీయం..

**విజయసాయిరెడ్డి, కేశినేని చిన్నిల మధ్య మాటల యుద్ధం**

**విజయవాడ ,అక్టోబరు 19 పెన్ పవర్:** విజయవాడ మేయర్ సీటు కేరాఫ్‌గా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, టీడీపీ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య మాటల యుద్ధం సాగింది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకిదిగడం వెనుక టీడీపీ కుట్ర ఉందని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఈ ఆరోపణలపై టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ ఉనికిని చాటుకునేందుకే ఏ2గా ఉన్న సాయిరెడ్డి తప్పుడుప్రచారాం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. విజయసాయి రెడ్డి కావాలనే టీడీపీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీంతో విజయవాడ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.టీడీపీ అధినేత,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనుసన్నల్లోనే ఏబీవీ వెంకటేశ్వరరావు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారని విజయసాయిరెడ్డి ఆరోపణలు చేశారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వంగవీటిరాధాను జనసేన పార్టీలోకి పంపించి.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఏబీవీని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలపడం చంద్రబాబు మార్కు దుర్మార్గపు రాజకీయానికి నిదర్శనమని విజయసాయి రెడ్డిఅన్నారు. ఏబీవీకి వామపక్షాలు మద్దతు తెలుపుతుండటంపై ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వైసీపీలు అన్ని ఒక్కటేనని, కలసి రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. 'జగన్ నెవర్‌అగైన్' అని శపథం చేసిన ఏబీవీ ఉద్దేశపూర్వకంగానే రెడ్డి పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేశారని, ఇటువంటి పాలిటిక్స్‌ని ప్రజలు హర్షించరని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.అయితే విజయసాయిరెడ్డికామెంట్స్‌పై కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ ఉనికిని చాటుకునేందుకే ఏ2గా ఉన్న సాయిరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఏబీ వెంకటేశ్వరరావు ఒక రిటైర్డ్ అధికారి అని,ఆయన వ్యక్తిగత హోదాలో పోటీ చేస్తున్నారని కేశినేని చిన్ని అన్నారు. దీనికి టీడీపీకి ముడిపెట్టడం వైసీపీ కుట్ర అని పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి ఇప్పుడు బీజూ కూటమిలో చిచ్చు పెట్టేందుకు తీవ్రంగాప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విజయసాయిరెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా... ఎంత బురద జల్లినా కూటమి ఐక్యతను దెబ్బతీయలేరని, వంగవీటి రాధాను అత్యధిక మెజారిటీతో మేయర్‌గాగెలిపించుకుని కూటమి పార్టీలు సత్తా చాటుతాయని కేశినేని చిన్ని సవాల్ విసిరారు. అదేవిధంగా అన్నిచోట్ల కూటమి విజయంతో విజయసాయిరెడ్డి లాంటి నోళ్లు మూయిస్తామని ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# కాంగ్రెస్ తరపున ఆమంచి వ్యక్తిగత పోరాటం

**చీరాల, ,అక్టోబరు 19 (న్యూస్ పల్స్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సమరం ఆసక్తికరంగా మారుతోంది. ప్రధానంగా అధికార టీడీపీ-కూటమికి, పుంజుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి మధ్య హోరాహోరీ పోరుకు రంగం సిద్ధమైంది. మాజీఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆమంచి కృష్ణమోహన్ క్షేత్రస్థాయిలో వేస్తున్న వ్యూహాత్మక అడుగులు చీరాల పురపోరును ఒక్కసారిగా వేడెక్కించాయి. ఇతర పార్టీల నుంచి కీలక నేతలనుచేర్చుకుంటూ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో తన పట్టును బలపరుచుకుంటోంది. ఈ క్రమంలోనే చీరాల రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. చీరాల బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొత్త మాసు సురేష్తన అనుచరులతో కలిసి ఆమంచి కృష్ణమోహన్ సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పొత్తులు, స్థానిక రాజకీయంలో అసంతృప్తి చెంది ఆయన కాంగ్రెస్ వైపు అడుగులు వేసినట్లుతెలుస్తోంది. బొంబే సురేష్ చేరికతో పట్టణ పరిధిలో వ్యాపార, సామాజిక సమీకరణాల్లో కాంగ్రెస్ బలం మరింత పెరిగిందని, స్థానిక పోరులో ఇది కాంగ్రెస్‌కు అదనపు బలాన్ని ఇస్తుందని భావిస్తున్నారు.చీరాలమున్సిపాలిటీలోని మొత్తం 44 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు ఆమంచి కృష్ణమోహన్ స్పష్టం చేశారు. ప్రతి వార్డులోనూ బలమైన అభ్యర్థులను నిలబెట్టి, టీడీపీ కూటమికి గట్టిపోటీ ఇచ్చేందుకు ఆయన పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు. స్వయంగా రంగంలోకి దిగి వార్డుల వారీగా ఆశావహుల ఎంపిక, ప్రచార వ్యూహాలను ఆమంచి పర్యవేక్షిస్తున్నారు. దీంతో చీరాలపురపాలక పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తమవుతున్నాయి.అధికార బలంతో పాటు స్థానిక శాసనసభ్యుల మద్దతుతో మున్సిపాలిటీపై పట్టు సాధించాలని టీడీపీ ప్రణాళికలు రచిస్తోంది. ఆమంచి కృష్ణమోహన్ సారథ్యంలోని కాంగ్రెస్ గట్టి సవాలు విసురుతుండటంకొరకరాని కొయ్యగా మారింది. చీరాల మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక పోరుగానే కాకుండా, ఇద్దరు కీలక నేతల ప్రతిష్ఠాత్మక సమరంగా మారడంతో ఇక్కడ ఫలితం ఎలా ఉండబోతుందోనన్న ఆసక్తివ్యక్తమవుతోంది. ఆమంచి రాజకీయ భవిష్యత్ కు ఈ ఎన్నికలు చాలా కీలకం.

# నేటి నుంచి లోకల్ ఫైటింగ్స్ 2.0



రాష్ట్రంలో స్థానిక ఎన్నికల రెండో దశకు సోమవారం తెర లేచింది. వరుసగా ఎన్నికల నిర్వహణకు సిద్ధమైన ఎన్నికల సంఘం జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సంగ్రామం ముగిసిన వెంటనే గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎన్నికల ప్రక్రియ మొదలవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వాతావరణం అలుముకున్నట్లైంది. సోమవారం మొదలు కానున్న జడ్పీ, మండల పరిషత్తు ఎన్నికల ప్రక్రియ వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగుతుంది.రాష్ట్రంలో 659 జడ్పీటీసీ, 9829 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల అయింది. దీనిప్రకారం 21 నుంచి మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న నామినేషన్ల పరిశీలన, 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు సమయం ఇస్తారు. వచ్చేనెల 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 659 ఎంపీపీ, 659 జడ్పీటీసీల ద్వారా 28 మంది జడ్పీ చైర్మన్లను ఎన్నుకునేందుకు ఈ ఎన్నికలను నిర్వహిస్తున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను ఓటర్లు నేరుగా ఎన్నుకోగా, మండల, జిల్లా పరిషత్ అధ్యక్షులను పరోక్ష విధానంలో ఎన్నుకుంటారు.కాగా, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల కారణంగా పరిషత్ ఎన్నికల నామినేషన్ కేంద్రాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. రేపటిలోగా ప్రతి మండల, జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే కాంట్రాక్టర్ ను కూడా ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల అధికార, విపక్షాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పోలీసులు గాలిలోకి కాల్పులు జరపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పరిషత్ ఎన్నికల్లో అటువంటి పరిస్థితి తలెత్తకుండా ఎన్నికల సంఘం ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని అంటున్నారు.ఇక పరిషత్ ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధమవడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సర్దుబాట్లపై చర్చలు మొదలయ్యాయి. రాష్ట్రంలోని మొత్తం 28 జడ్పీ స్థానాలు, 659 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కూటమిలో మూడు పార్టీలు సర్దుబాటు చేసుకోవాల్సివుందని అంటున్నారు. దీంతో మూడు పార్టీలలో ఎవరు ఎన్ని స్థానాలు చొప్పున తీసుకుంటారనే చర్చ ఆసక్తి రేపుతోంది. మున్సిపల్ స్థానాల నిష్పత్తిలోనే సర్దుబాట్లు ఉంటాయా? లేదా? అనేది చూడాల్సివుందని అంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పలుచోట్ల తిరుగుబాట్లు కూటమిలో తలనొప్పులు తెస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో జడ్పీల విషయంలో మరింత జాగ్రత్తగా నిర్ణయాలు ఉండాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

మరోవైపు చూస్తుండగానే నామినేషన్ల ప్రక్రియకు సమయం ఆసన్నమవడం, ఇప్పటివరకు పొత్తులపై కనీస చర్చలు జరిగినట్లుగా సమాచారం లేకపోవడంపై కూటమిలో జడ్పీ ఆశావహులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఏ జడ్పీని ఎవరికి కేటాయిస్తారనేది తెలిస్తే తమ ప్రయత్నాలు చేసుకొందామని భావిస్తున్న నేతలు అధిష్టానానికి దగ్గరగా ఉండే నేతలతో టచ్ లో ఉంటూ ఆరా తీస్తున్నారు. మరోవైపు వందల సంఖ్యలో స్థానాలపై చర్చలు జరగాల్సివుండటంతో అధిష్టానాలు జిల్లా నాయకత్వానికి బాధ్యతలు అప్పగించి రాష్ట్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలని ఆలోచిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి పరిషత్ ఎన్నికల ప్రక్రియ మొదలుకావడంతో సీట్ల సర్దుబాటు నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వరకు అన్ని అంశాలు ఉత్కంఠ రేపుతోంది.

## చైనీయుల ట్రాప్ లో సైనికాధికారి భార్య.. అసలేమైందంటే?

ఆమె సాదాసీదా వ్యక్తి కాదు. ఆర్మీలో ఉన్నత అధికారి భార్య. అంతేకాదు.. విద్యావేత్త కూడా. అలాంటి ఆమె.. విద్య.. పరిశోధన సంబంధించిన కార్యకలాపాలు చేస్తానన్న పేరుతో భారత సైన్యానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని సేకరించటమే కాదు.. చైనా నిఘా అధికారులతో పాటు విదేశీ నిఘా సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లుగా అనుమానిస్తున్నారు. తాజాగా ఆమెపై జమ్ములోని పోలీస్ స్టేషన్ లో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ ఉదంతం ఇప్పుడు పెను సంచలనంగా మారింది.
ఆర్మీలో సీనియర్ అధికారి భార్య పాలపర్తి నాగలక్ష్మిపై షాకింగ్ ఆరోపణలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. జమ్ములో భర్తతో కలిసి నివసిస్తున్న ఆమెను తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఆమె ఫోన్ ను స్వాధీనం చేసుకొని విశ్లేషిస్తున్నారు. 2023లో ఐక్యరాజ్యసమితిలో ఐటీ ఇంటర్న్ షిప్ పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం ఫ్రీలాన్స్ పరిశోధకురాలిగా వ్యవహరిస్తున్నారు.విదేశీ విశ్వవిద్యాలయాలు.. పరిశోధనా సంస్థలకు చెందిన విద్యావేత్తలుగా నటించిన చైనా ఏజెంట్లు ఆమెను ఆన్ లైన్ లో పరిచయం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. మొదట్లో పర్యావరణం.. అంతర్జాతీయ సంబంధాలు లాంటి సాధారణ అంశాలపై ఆమెతో ఆర్టికల్స్ రాయించుకున్న వారు.. ఆ తర్వాత వ్యూహాత్మక.. సైనిక రక్షణ రంగానికి చెందిన సున్నితమైన సమాచారాన్ని ఆమె ద్వారా తీసుకున్నట్లుగా అనుమానిస్తున్నారు.
ఆమె ఇంటెలెక్చువల్ ట్రాప్ లో చిక్కుకుపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. దేశ భద్రతతో ముడిపడి ఉన్న అంశాలను ఆమె సేకరించినట్లుగా తెలుస్తోంది. ఫోటోలు.. రహస్య పత్రాలు.. ఎలక్ట్రానిక్ డేటాను సేకరించిన ఆమె.. ఎన్ క్రిప్టెడ్ కమ్యునికేషన్ ద్వారా తనతో సంప్రదింపులు జరిపే వారికి సమాచరాన్ని అందించినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ కేసులోని సున్నితత్వం కారణంగా పలు విషయాల్ని వెల్లడించకుండా పోలీసులు గోప్యతను పాటిస్తున్నారు. ఇంతకు ఆమెను ఎలా ట్రేస్ చేశారన్న విషయానికి వెళితే.. ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి.భారత రక్షణ రంగానికి.. సరిహద్దు వ్యూహాలకు సంబంధించిన కీ వర్డ్స్ తో ఇంటర్నెట్ లో జరిగే ఎన్ క్రిప్టెడ్ కమ్యూనికేషన్ లపై కేంద్ర నిఘా సంస్థలు నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. ఈ క్రమంలోనే చైనాకు చెందిన కొన్ని ఐపీ అడ్రస్ లు.. అనుమానాస్పద సోషల్ మీడియా ప్రొఫైల్స్ భారత్ లోని ఒకరితో నిరంతరం చాటింగ్ చేస్తున్నట్లుగా నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో అలెర్టు అయిన వారు ఈ చాటింగ్ ఎక్కడి నుంచి జరుగుతుందన్న విషయాన్ని ట్రేస్ చేశారు. జమ్ముకశ్మీర్ లోని సైనిక స్థావరాలకు సమీపంలో ఉన్న గాంధీనగర్ లోని ఒక ఐపీ అడ్రస్ అన్న విషయాన్ని గుర్తించారు.

# చంద్రబాబు పాలనలో ఇలా జరుగుతుందేంటి చెప్మా?




ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు చంద్రబాబు పాలనపైనే మచ్చ తెచ్చేలా కనిపిస్తుంది. గతంలో ఎన్నడూ చంద్రబాబు పాలనలో ఇలాంటి పరిస్థితులు లేవు. వైసీపీని గొడ్డలి పార్టీ అని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని తరచూ విమర్శించే చంద్రబాబు ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు ప్రజల్లో చర్చనీయాంశంగామారాయి. సమర్థించుకునే వాళ్లు సమర్థించుకోవచ్చు. చివరకు నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకోకపోవడంతో ఇక ఎన్నికల ప్రక్రియ ఎందుకన్న ప్రశ్న సహజంగా ప్రజలలో ఎదురవుతుంది. స్థానిక సంస్థలలో ఈ రచ్చ ఒకింత టీడీపీకి లాభం కలగవచ్చు. కానీ సాధారణ ఎన్నికల్లో మాత్రం ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కూటమి ప్రభుత్వానికి మరియు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు పొంతనలేకుండా ఉందని అన్నారు. చంద్రబాబు పాలనలోఎప్పుడూ శాంతి భద్రతలు అదుపు తప్పలేదు. రిటర్న్ గిఫ్ట్ అని అనొచ్చు కాని, వైసీపీకి, టీడీపీకి పెద్దగా తేడా ఏముందన్న ప్రశ్నసహజంగా తలెత్తుంది.

**పాలనపై మచ్చ పడే ప్రమాదం...**

అయితే దీనివల్ల చంద్రబాబుపాలనపై "మచ్చ పడుతుందా" లేదా అనేది ఎన్నికల ప్రక్రియ సాగే విధానం, కూటమి పార్టీల మధ్య సమన్వయం మరియు ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఈ ఎన్నికల విషయంలో రాజకీయంగా జరుగుతున్న ప్రధాన చర్చనీయాంశాలు ఇదే కావడం విశేషం. ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నవంబరు 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. ఏ ఒక్క స్థానం కూడా ఓడిపోవడానికి వీల్లేదని, 100 శాతం స్థానాలు కూటమి కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల గెలుపు బాధ్యతను పూర్తిగా ఆయా జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులకే అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోతే అది ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. కానీ నామినేషన్ల నుంచే గొడవలు జరుగుతుండటం, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడంపై పలు అనుమానాలను వైసీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎన్నికలు ఎందుకు? నేరుగా తమ అభ్యర్థులను నామినేట్ చేసుకోవచ్చు కదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. అనేక చోట్ల హింసాకాండ చెలరేగడంపై తటస్థ ప్రజల్లో ఒకింత ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది.

**ప్రజా తీర్పు పైనే...**

ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార కూటమిపై విమర్శలు గుప్పిస్తోంది. క్షేత్రస్థాయి లో అధికార పక్షం తమ నేతలపై దాడులకు దిగుతోందని, కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేదని ఆరోపిస్తోంది. విపక్షాలు సహజంగా ఇలాంటి ఆరోపణలు చేయడం సహజమే. కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు పై ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే నామినేషన్లు వేయించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిపి తమకు అనుకూలమైన తీర్పు వస్తే తమ పాలన బాగుందని చెప్పుకోవచ్చు. అలాగే ఓటములు ఎదురయితే తప్పులు సరిదిద్దుకునే వీలుంది. కానీ ఇలా చేసుకుంటే పోతే ప్రస్తుతానికి బాగానే ఉంటుంది కానీ, సాధారణ ఎన్నికల్లో ఇది రివర్స్ అవుతుందని, ప్రజలు కూడా చంద్రబాబు పాలనపై ఉన్న నమ్మకాన్ని కోల్పోతారని వ్యాఖ్యానిస్తున్నారు. సమర్థులైన, అవినీతి మరకలు లేని అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా ప్రజల్లో ఉన్న సానుకూలతను నిలబెట్టు కోవాలని చంద్రబాబు వ్యూహాలు రచించాలి. ఈ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా, ఎలాంటి ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ముగించి, క్లీన్ స్వీప్ సాధిస్తే చంద్రబాబు పాలనా దక్షతకు మరింత బలం చేకూరుతుంది. అలా కాకుండా హింసాత్మక ఘటనలు లేదా అంతర్గత విభేదాలు రచ్చకెక్కితే అది పాలనపై కొంతవరకు మచ్చగా మారే ప్రమాదం ఉంది. అందుకే ఇది చంద్రబాబు జమానా కాదన్న కామెంట్స్ జనంలో వినిపిస్తున్నాయి.

# అధిష్టానానికి అడ్డం తిరిగిన కొలికపూడి.. ఎన్నిసార్లో లెక్కలేదుగా?




టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరోసారి టీడీపీ నాయకత్వం ఆదేశాలను ధిక్కరించారు. తాను స్వయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థిని ప్రకటించి మరోసారి పార్టీ అధిష్టానానికే సవాల్ విసిరారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు కూటమి రాజకీయంలో టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీసుకున్న నిర్ణయం కలకలం రేపుతోంది. రాబోయే పురపాలక ఎన్నికల్లో తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని కూటమి పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించగా, దానికి వ్యతిరేకంగా కొలికపూడి తిరుగుబాటు చేశారు. దీంతో ఆయన తన అనుచరులను రంగంలోకి దించారు. ఈ మేరకు కొలికపూడి శ్రీనివాసరావు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. నామినేషన్ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన పోస్టు చేయడం వివాదానికి కారణమయింది. పొత్తులో భాగంగా అనేక స్థానాలు జనసేన, బీజేపీకి కేటాయించారు. అయితే పలు చోట్ల నిరసనలు వినిపించినా ఏకంగా ఎమ్మెల్యే గా ఉండి కొలికపూడి తీసుకున్న నిర్ణయంపై నాయకత్వం కూడకా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**వివాదానికి అసలు కారణమిదే...**

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానానికి కూటమి తరపున జనసేన పార్టీ తమ అభ్యర్థిగా మాధవి పేరును అధికారికంగా ప్రకటించింది. అయితే ఎమ్మెల్యే కొలికపూడి రెబల్ అభ్యర్థిని ప్రకటించారు. ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కొలికపూడి, జనసేన అభ్యర్థికి పోటీగా టీడీపీ తరపున రెబల్ అభ్యర్థిగా పెనుబల్లి నాగ శ్రావణిని రంగంలోకి దించారు.స్వయంగా నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. నిజానికి అనంతపురం లోనూ పార్టీలో విభేదాలతో అక్కడ కార్పొరేషన్ మేయర్ పదవిని టీడీపీ నాయకత్వం బీజేపీకి అప్పగించింది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి గత కొంతకాలంగా పొసగడం లేదు. దీంతో మధ్యే మార్గంగా అక్కడ టీడీపీ అధినేత చంద్రబాబు అనంతపురం కార్పొరేషన్ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. తిరువూరులోనూ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు మధ్య చాలా కాలం నుంచి విభేదాలు నడుస్తుండటంతో అక్కడ రెండు గ్రూపులుగా విడిపోవడంతో మధ్యేమార్గంగా జనసేనకు అక్కడ మున్సిపల్ ఛైర్మన్ పదవిని అప్పగించారు.

**తనను లక్ష్యంగా చేసుకుని...**

అనంతపురంలో సజావుగానే ఉన్నా తిరువూరులో మాత్రం కొలికపూడి శ్రీనివాసరావు అధిష్టానికి అడ్డం తిరిగారు.ఆదివారం నాగ శ్రావణితో నామినేషన్ వేయించబోతున్నట్లు, ఈ నామినేషన్ ర్యాలీకి అందరూ రావాలంటూ కొలికపూడి శ్రీనివాసరావు స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.పొత్తు ధర్మాన్ని పక్కనబెట్టి జనసేన అభ్యర్థికి పోటీగా కొలికపూడి స్వయంగా అభ్యర్థిని ప్రకటించడంతో తిరువూరు ఎన్డీయే కూటమిలో తీవ్ర ఉద్రిక్తత, చర్చనీయాంశంగా మారింది. కొలికపూడి శ్రీనివాసరావుకు వివాదాలు కొత్త కాదు. గత కొంతకాలంగా అనేక వివాదాల్లో ఆయన ఇరుక్కున్నారు. దీంతో పార్టీ నాయకత్వం పిలిచి హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆయన తన వైఖరి మార్చుకోలేదు. కానీ కొలికపూడి శ్రీనివాసరావు వాదన మరోలా ఉంది. కేవలం తనను లక్ష్యంగా చేసుకుని తిరువూరు మున్సిపల్ పదవిని జనసేనకు పొత్తు ధర్మాన్ని బూచి చూపుతూ జనసేనకు కేటాయిం చడాన్ని కొలికపూడి శ్రీనివాసరావు తప్పుపడుతున్నారు. మరి కొలికపూడి పై ఈసారి నాయకత్వం ఎలాంటి చర్యలకు దిగుతుందో చూడాలి

# హైదరాబాద్ లో హత్య చేసి.. యూపీలో భారీ దోపిడీకి స్కెచ్ తో దొరికేశారు

కొద్ది నెలల క్రితం హైదరాబాద్ లోని అత్యంత ఖరీదైన ప్రాంతంగా పేరున్న జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్ లోని ఒక మాజీ ఐఏఎస్ అధికారి సతీమణిని..ఆయన ఇంట్లో పని చేసే వారు దారుణంగా హత్య చేసి.. ఇంట్లోని నగలతో పారిపోవటం తెలిసిందే. పెను సంచలనంగా మారిన ఈ ఉదంతాన్ని అప్పట్లో పోలీసు అధికారులు సీరియస్ గా తీసుకున్నారు. ఆ తర్వాతి కాలంలో ఈ చోరీతో సంబంధం ఉన్న ఒకరిని అదుపులోకి తీసుకున్నా.. దీనికి కారణమైన అసలోళ్లు మాత్రం తప్పించుకు తిరుగుతున్న పరిస్థితి.
అయినప్పటికి పట్టువదలని విక్రమార్కుల మాదిరి శ్రమించిన పోలీసులు తాజాగా వేసిన స్కెచ్ లో దొరికిపోయారు. ఈ ఉదంతంలో ట్విస్ట్ ఏమంటే.. ఒక భారీ చోరీకి ప్లాన్ చేసిన నిందితులను.. హైదరాబాద్ పోలీసులు పట్టేశారు. మాజీ ఐఏఎస్ సతీమణిని హత్య చేసి చోరీ చేసిన పనోళ్లు.. ఈ దారుణ ఉదంతం తర్వాత పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు దేశ సరిహద్దులు దాటేసి నేపాల్ కు వెళ్లి తలదాచుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశం కాని దేశం వెళ్లి నేరస్తుల్ని అదుపులోకి తీసుకోవటం అంత సాధ్యమయ్యే పని కాదు. దీంతో.. వారి కోసం ఎదురుచూస్తున్న హైదరాబాద్ పోలీసులకు తాజాగా అందుకున్న సమాచారంతో పక్కా ప్లాన్ వేశారు. నేపాల్ కు పారిపోయిన నిందితులు మరో భారీ చోరీకి ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా తమ గ్యాంగ్ లోని వారంతా ఒకేసారి ఒకే చోటుకు వెళితే పోలీసులకు చిక్కుతామన్న ఉద్దేశంతో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేలా ప్లాన్ చేసుకున్నారు. ఇందులో భాగంగా సుమారు పదిహేను రోజుల క్రితం యూపీ.. బిహార్.. ఢిల్లీ తదితర ప్రాంతాలకు వేర్వేరుగా వెళ్లి అక్కడ దాక్కున్నారు. మాజీ ఐఏఎస్ సతీమణి హత్య కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు నిందితుల మీద నెలల తరబడి నిఘా పెట్టారు.ఎట్టకేలకు వారు మళ్లీ భారీ చోరీలకు ప్లాన్ చేసిన వివరాల్ని గుర్తించారు. నేపాల్ నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా భారీ చోరీ చేయటం కోసం ఎదురుచూస్తున్న వారిని వేర్వేరుగా పట్టేసుకున్నారు. తాజాగా హైదరాబాద్ నగర పోలీసుల అదుపులో నలుగురు నిందితులు ఉన్నారు. తాజాగా హైదరాబాద్ కు తీసుకొచ్చి వారిని విచారిస్తున్నారు. మొత్తంగా ఈ కేసుకు సంబంధించి మొత్తం ఏడుగురు నిందితులకు నలుగురు పోలీసుల అదుపులో ఉండగా.. మరో ముగ్గురు నేపాల్ లోనే ఉన్నట్లుగా తెలుస్తోంది. పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు బయటకు వచ్చే వీలుంది.



## కార్బన్ కూటమిలో భారత్?

జులై 31న దేశంలోని సుమారు 490 కంపెనీలు, ఏడు పారిశ్రామిక రంగాల నుంచి, జాతీయ 'కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ స్కీమ్' (సీసీటీఎస్) కింద తమ తొలి వార్షిక కాలుష్య నివేదికలు సమర్పించాయి. 2023 జూన్‌లో నోటిఫై అయి, ఇంతకాలం కాగితాలపైనే ఉన్న ఈ పథకం ఇప్పుడు బైండింగ్ లక్ష్యాలు, జరిమానాలు, నిజమైన సంస్థలతో అమల్లోకి వచ్చింది. అల్యూమినియం, సిమెంట్, క్లోర్-ఆల్కలీ, కాగితం-గుజ్జు, చమురు శుద్ధి, పెట్రోకెమికల్స్, వస్త్ర రంగాల్లో లక్ష్యాలు నిర్దేశితమయ్యాయి; ఇనుము-ఉక్కు రంగంలో సవరించిన ముసాయిదా లక్ష్యాలు జూన్‌లో వెలువడ్డాయి. అక్టోబర్‌లో తొలి కార్బన్ క్రెడిట్ సర్టిఫికెట్ల జారీ, ఆపై నవంబర్ నుంచి జనవరి మధ్య విద్యుత్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్ మొదలవుతుందని అంచనా; అక్టోబర్ తొలి వారం వరకు ఒక్క సర్టిఫికెట్ కూడా చేతులు మారలేదని నివేదికలు చెబుతున్నాయి. అంటే తొలి లావాదేవీ, భారత కార్బన్ మార్కెట్ రూపకల్పన ఆచరణలో నిలబడుతుందా? అన్నదానికి మొదటి నిజమైన పరీక్ష. ఇంతలో బయట మరో పరిణామం జరిగింది. యూరోపియన్ యూనియన్, చైనా, బ్రెజిల్ మేలో ఫ్లారెన్స్‌లో 'ఓపెన్ కోయలిషన్ ఆన్ కంప్లయన్స్ కార్బన్ మార్కెట్స్' (ఓసీసీఎం)ను ప్రారంభించాయి; ప్రపంచంలోని నిర్బంధ కార్బన్ మార్కెట్లు ఒకదానితో ఒకటి "మాట్లాడుకునే" తీరును సమన్వయం చేయడం దీని లక్ష్యం. 2025 నవంబర్‌లో బెలెమ్‌లో జరిగిన కాప్30లో ఆమోదం పొందిన ఈ ఆలోచనకు బ్రెజిల్ తొలి రెండేళ్లు అధ్యక్షత వహిస్తుండగా, చైనా, యూరోపియన్ కమిషన్ సహ అధ్యక్షులుగా ఉన్నాయి. జర్మనీ, న్యూజిలాండ్ తొలి కొత్త సభ్యులుగా చేరగా, కెనడా, ఫ్రాన్స్, నార్వే, సింగపూర్, తుర్కియే, బ్రిటన్ తర్వాత చేరాయి; సెప్టెంబర్‌లో వుహాన్‌లో కూటమి తన తొలి కార్యాచరణ ప్రణాళికను ఆమోదించింది. భారత్ మాత్రం ఇప్పటివరకు బయటే ఉంది. అందుకే ప్రశ్న ఇక "మనం కార్బన్ ధరను నిర్మించుకోగలమా" అన్నది కాదు, దాన్ని ఇప్పటికే నిర్మించాం; నిబంధనలు రాసే గదికి వెలుపల కూర్చునే స్తోమత మనకు ఉందా అన్నదే, లేక ఊహించని ప్రమాదాల వల్ల దాన్ని విస్మరించడమే మంచిదా అనేది కూడా ఆలోచించాల్సిందే.

చేరాలన్న వాదనకు రెండు కీలక కారణాలున్నాయి. మొదటిది, ప్రపంచవ్యాప్తంగా కార్బన్ ధర వ్యవస్థల విస్తరణ: ఇప్పటికే 50కి పైగా దేశాలు ఏదోక రూపంలో కార్బన్ ధరను అమలు చేస్తున్నాయి. కార్బన్ ధర ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద ఉద్గారాల తగ్గింపు ఖర్చును కనిష్ఠం చేస్తుందని (ఇది గ్లోబల్ సౌత్‌కు కీలకం), ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ బలహీన వర్గాలపై ప్రభావాన్ని తగ్గిస్తుందని, వేడిగాలులు, వరదలవంటి ప్రభావాలతో ప్రభుత్వ వనరులు ఒత్తిడిలో ఉన్న సమయంలో గణనీయమైన ఆదాయాన్నీ ఇవ్వగలదని ఈ వాదన చెబుతుంది. ఏదో ఒక దశలో ఈ దేశీయ వ్యవస్థల్లో చాలా వాటిని కొంతవరకైనా అనుసంధానం చేస్తారు; కఠిన లక్ష్యాలున్న ప్రాంతాల నుంచి ఆదాయం పొందే అవకాశం ఉన్నందున భారత సీసీటీఎస్‌ను ఇతర వ్యవస్థలతో కలపడం విలువైనదే. రెండో కారణం 'క్లైమేట్ క్లబ్‌లు'. భౌగోళిక రాజకీయాలు ఐక్యరాజ్యసమితి వాతావరణ చర్చలను చీలుస్తున్న నేపథ్యంలో, యూరోపియన్ యూనియన్ 'కార్బన్ బోర్డర్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం' (సీబీఏఎం) లాంటి కూటమి ఏర్పడే పక్షంలో సిద్ధంగా ఉండటం అవసరం. కాప్30 అధ్యక్షుడు సమావేశపరిచిన స్వతంత్ర మండలి సందర్భంగా విడుదలైన నివేదిక, సీబీఏఎం కేంద్రంగా ఏర్పడే కూటములకు ప్రత్యామ్నాయ దృశ్యాలను వివరించింది: సభ్యదేశాల్లో ఒకే లేదా భిన్నమైన కార్బన్ ధరలు, సభ్యులకు ప్రోత్సాహకాలు, సభ్యేతరులకు జరిమానాలు. సీబీఏఎం ఇప్పుడు అమల్లో ఉంది; భారత ఎగుమతిదారులకు ఇది ఇప్పటికే వాస్తవం. ఐసీఆర్ఐఈఆర్ జూన్ 2026 పత్రం, టన్నుకు 86 డాలర్ల కార్బన్ ధర వద్ద ఈయూకు భారత ఇనుము-ఉక్కు ఎగుమతులు సుమారు 24 శాతం, అల్యూమినియం వంటి లోహాల ఎగుమతులు సుమారు 10 శాతం తగ్గవచ్చని అంచనా వేసింది. భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం భారత ఎగుమతులను సీబీఏఎం నుంచి మినహాయించదని నివేదికలు చెబుతున్నాయి; ఉక్కు, అల్యూమినియం రంగాల డీకార్బనైజేషన్‌కు ఈయూ 50 కోట్ల యూరోల సాయం ప్రకటించింది; కార్బన్ మార్కెట్ సహకారాన్ని కొనసాగించడానికి భారత్, యూరోపియన్ కమిషన్ అంగీకరించాయి.

ఈ కూటమిలో చేరడంలో ప్రమాదాలున్నాయా? ఇది కేవలం దేశీయ కంప్లయన్స్ మార్కెట్లు, కార్బన్ ధరల సమన్వయం గురించి; ఏ ఉద్గార తగ్గింపు లక్ష్యాన్నీ, మరే నిర్ణయాన్నీ బలవంతంగా అమలు చేయదు. అయితే చర్చలు పురోగమించే కొద్దీ సభ్యులు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. కూటమి పాలనా నిర్మాణం ఉన్నతస్థాయి సమావేశాలు, కార్యనిర్వాహక సమావేశాలు, థీమాటిక్ వర్కింగ్ గ్రూపులు, సచివాలయంతో ఉంటుంది. అందుకే గదిలో ఉండి చర్చలను తీర్చిదిద్దడం, బయట నుంచి పరిణామాలకు స్పందించడం కంటే ముఖ్యం; ప్రమాదం బయట ఉండటంలోనే ఎక్కువ. బ్రెజిల్ వ్యవస్థాపక సభ్యురాలు, ఇతర సమ భావగల అభివృద్ధి చెందుతున్న దేశాలు సభ్యత్వానికి సిద్ధమవుతుండటం భారత్‌కు భరోసా కావాలి. ఇదే సమయంలో కొన్ని ఆందోళనలనూ నిర్లక్ష్యం చేయరాదు: చైనా సహ-అధ్యక్ష పాత్ర, ఈయూ ప్రమాణాల ప్రభావం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సామర్థ్యం, కొలత, నివేదన, ధృవీకరణ (ఎంఆర్‌వీ) వ్యవస్థల సిద్ధత, భారత సీసీటీఎస్ లక్ష్యాలు ఉద్గార తీవ్రత ఆధారితం కావడం. కాబట్టి భారత్ చేరినా, తన దేశీయ మార్కెట్ రూపకల్పన, ధర పరిమితులు, అభివృద్ధి ప్రాధాన్యాలను కాపాడుకుంటూ, చర్చల్లో గ్లోబల్ సౌత్ గళంగా వ్యవహరించాలి. భవిష్యత్ ప్రపంచంలో కొన్ని అంశాలు ఖాయం: భౌగోళిక రాజకీయాలు చీలికతోనే కొనసాగుతాయి, వాతావరణ చర్చలు అడ్డంకులను ఎదుర్కొంటాయి, కార్బన్ ధరల ప్రాధాన్యం పెరుగుతుంది, పారిస్ ఒప్పంద చట్రం వెలుపలి కృషి కీలకమవుతుంది. ఓసీసీఎం భారత డీకార్బనైజేషన్ ఎంపికలకు సరిపోయే వేదిక, కార్బన్ మార్కెట్ల గురించి తెలుసుకోవడానికే కాక, ఇతర దేశాల కార్బన్ ధర నిర్మాణాలతో, సరిహద్దు కార్బన్ పన్నులతో వ్యవహరించడానికి కూడా. కాబట్టి భారత్ ఈ నిర్ణయాన్ని ఆలస్యం చేయకుండా, సాధ్యమైనంత త్వరగా తీసుకోవడం మంచిది. గదిలో కూర్చున్నవారే నిబంధనలు రాస్తారు, బయట నిలబడినవారు వాటిని పాటించాల్సి వస్తుంది. భారత్ ఇప్పటికే తన కార్బన్ మార్కెట్‌ను నిర్మించుకుంది; ఇక ఆ మార్కెట్ నియమాలను తీర్చిదిద్దే టేబుల్ దగ్గర తన కుర్చీ వేసుకోవాల్సిన సమయం ఇదే!

### పనికొచ్చే పలుకు



## భాగస్వామికి నచ్చినట్టు మారడమూ ప్రేమే!

ఈ రోజుల్లో ప్రేమను వెతకడం కంటే.. మనల్ని నిజంగా అర్థం చేసుకునే వ్యక్తిని వెతకడమే పెద్ద ఛాలెంజ్. మన మూడ్‌ను గుర్తించాలి.. చెప్పకుండానే బాధను అర్థం చేసుకోవాలి.. విజయాలను చూసి ఆనందించాలి. అవసరమైనప్పుడు మనకోసం నిలబడాలి. ఇలాంటి లక్షణాలున్న జీవిత భాగస్వామిని చాలామంది కోరుకుంటారు. కానీ, మనం కోరుకునే లక్షణాలు మనలో ఉన్నాయా అన్నదీ ఆలోచించండి.

**"ప్రేమంటే నచ్చిన వ్యక్తిని పొందడమే కాదు.**
**ఆ వ్యక్తికి నచ్చిన మనిషిగా ఎదగడానికీ ప్రయత్నించడం"**

ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం. ఇద్దరు వ్యక్తులు ప్రేమలో ఉన్నారు. ఇద్దరికీ ఉద్యోగాలున్నాయి. ఇద్దరికీ ఒత్తిళ్లున్నాయి. ఒకరికి పని ఎక్కువై అలసిపోయిన రోజు.. మరొకరు తన సమస్యల చిట్టా విప్పి కూర్చోకుండా, 'నువ్వు రెస్ట్ తీసుకో.. మిగతావి తర్వాత చూద్దాం' అని అంటే, ఆ మాటలో ఎంత ప్రేముందో గమనించండి. ఖరీదైన గిఫ్ట్ ఇవ్వకున్నా.. ఆ క్షణంలో ఆ అవసరాన్ని గుర్తించడమే గొప్ప బహుమతి. నిస్వార్థ ప్రేమంటే మనల్ని మనం పూర్తిగా మర్చిపోయి, ఎదుటివారి కోసం బతకడం కాదు. ఇద్దరి అవసరాలకూ సమానమైన విలువ ఇవ్వడం. ఒకరు ఎప్పుడూ త్యాగాలు చేస్తూ.. మరొకరు వాటిని తమ హక్కుగా భావిస్తే, అది ప్రేమ కాదు.. అసమతుల్యత! ఆరోగ్యకరమైన బంధంలో ఎవరు ఎక్కువ ఇచ్చారు? ఎవరు తక్కువ ఇచ్చారు? అనే లెక్కలు ఉండకపోవచ్చు. కానీ, ఒకరి కష్టం మరొకరికి కనిపించాలి. ఒకరి త్యాగం మరొకరికి విలువైనదిగా అనిపించాలి.

ఇక్కడే అసలు సమస్య మొదలవుతుంది. మనకు ఎలాంటి లెక్కలు వేయని భాగస్వామి కావాలి. మన తప్పులను అర్థం చేసుకోవాలి. మన మౌనాన్ని చదవాలి. మనకు నచ్చినట్లుగా మారాలి. కానీ, మన వంతు వచ్చేసరికి మాత్రం 'నన్ను నేను మార్చుకోవాల్సిన అవసరం ఏముంది?' అంటాం. ఎదుటివారు మన కోసం మారాలని కోరుకుంటాం.. మనలోని లోపాలను సరిదిద్దుకోవడానికి మాత్రం ఇష్టపడము. ఈ ఆలోచనా విధానం మారనంతవరకు బంధంలో ప్రేమ కంటే అసంతృప్తే ఎక్కువ.

ఇది జెన్ జీకీ వర్తిస్తుంది. సోషల్ మీడియాలో పర్ఫెక్ట్ రిలేషన్‌షిప్స్, గ్రీన్ ఫ్లాగ్స్, రెడ్ ఫ్లాగ్స్ గురించి బోలెడన్ని పోస్టులు కనిపిస్తాయి. ఒక్క లక్షణాన్ని బట్టి జీవిత భాగస్వామి పర్ఫెక్ట్ అని నిర్ణయించలేం! బలమైన బంధం కోసం సహనం, సంభాషణ, పరస్పర గౌరవం, బాధ్యత అవసరం. ఫిల్టర్ వేసిన ఫొటోతో శరీరం మారనట్లే.. గ్రీన్ ఫ్లాగ్స్ గురించి పోస్టులు షేర్ చేసినంత మాత్రాన వ్యక్తిత్వం మారదు.

మరి, మనలో నిస్వార్థ ప్రేమను ఎలా పెంచుకోవాలి? భాగస్వామి చెప్పేది మధ్యలోనే ఆపకుండా వినండి. మీకు నచ్చనప్పుడు కూడా వారి అభిప్రాయానికి గౌరవం ఇవ్వండి. తప్పు చేసినప్పుడు సమర్థించుకోవడం కంటే అంగీకరించడం నేర్చుకోండి. వారు అడిగినప్పుడే కాదు.. అవసరమైనప్పుడు కూడా తోడుగా నిలవండి. అదే సమయంలో మీ భావాలను, అవసరాలను కూడా స్పష్టంగా చెప్పండి. ప్రేమ పేరుతో మీ ఆత్మగౌరవాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు. గుర్తుంచుకోండి.. మంచి భాగస్వామిని వెతకడం తప్పు కాదు. కానీ, మనల్ని మనం మెరుగుపరుచుకోకుండా అలాంటి వ్యక్తి కోసం ఎదురుచూడటం మాత్రం సరైన ఆలోచన కాదు.

మీ జీవితంలోకి వచ్చే వ్యక్తి మీ జీవితాన్ని అందంగా మార్చవచ్చు. కానీ, మీరు కూడా మరొకరి జీవితంలో అలాంటి వెలుగుగా మారగలిగినప్పుడే.. ప్రేమ ఒక అందమైన అనుభవంగా మారుతుంది. అందుకే ఈ రోజు ఒక్క ప్రశ్న వేసుకోండి.. 'నాకు ఎలాంటి భాగస్వామి కావాలి?' అని కాదు.. 'నేను ఎలాంటి భాగస్వామిని కాగలను?' అని! ఎందుకంటే, ప్రేమలో మనకు దక్కే ఆనందం కంటే.. మన వల్ల ఎదుటివారికి కలిగే ఆనందం కూడా అంతే ముఖ్యం.

## బాల్యం మెదళ్లపై 'తెరల' నీడలు!



ప్రతి సాయంత్రం ప్రపంచవ్యాప్తంగా ఒకే దృశ్యం. టీనేజర్ల ఫోన్‌లో చాట్‌లు, వీడియోలు, సోషల్ మీడియా, గేమ్‌ల మధ్య గోల. హోంవర్క్ ఎలాగూ ఏఐ చేసేస్తుంది. ఎదుగుతున్న మెదడు ప్రపంచాన్ని అనుభవించే, నేర్చుకునే తీరులో ఇది లోతైన మార్పు. భారత్‌కు కీలకమైన ఆస్తి.. పాతికేళ్లలోపున్న 65 కోట్ల జనాభా. విద్య, వినోదం, సామాజిక సంబంధాలు ఆన్‌లైన్‌కు మారుతున్నకొద్దీ యువత 'తెరల'మధ్య బతికేస్తోంది. డిజిటల్ ప్రపంచం సమాచారం, విద్యా వనరులకు అపూర్వమైన అందుబాటును, నేర్చుకోవడానికి కొత్త మార్గాలను ఇచ్చింది; ఏఐ ఈ అవకాశాలను మరింత విస్తరించింది. కానీ అదే సమయంలో పిల్లల జీవితాల్లోకి శక్తిమంతమైన, చాలావరకు నియంత్రణ లేని ఒక శక్తి వచ్చింది. నిజానికి -సాంకేతికత సమస్య కాదు; ఆందోళన ఏమిటంటే, జ్ఞానం, భావోద్వేగాలు, ప్రవర్తనకు ఆధారమైన మెదడు వ్యవస్థలు ఇంకా పరిపక్వమవుతున్న కీలక దశల్లో శక్తిమంతమైన డిజిటల్ సాధనాలకు నిరంతరం గురికావడం. ఏకాగ్రత, ప్రణాళిక, నిర్ణయాలు, ఆవేశ నియంత్రణకు తోడ్పడే 'ప్రీఫ్రంటల్ కార్టెక్స్' యుక్తవయసు ఆరంభం వరకు పరిపక్వమవుతూనే ఉంటుంది. దట్టమైన, పునరావృతమయ్యే డిజిటల్ అనుభవాలు కొన్ని మెదడు మార్గాలను బలపరుస్తూ, మరికొన్నింటిని అభివృద్ధి చెందకుండా వదిలేయవచ్చు. అధిక స్క్రీన్ సమయాన్ని మెదడు నిర్మాణంలో మార్పులతో ముడిపెట్టే పరిశోధనలు వస్తున్నాయి; అవి కారణాన్ని నిరూపించవు, కానీ ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, స్వీయ నియంత్రణ, సృజనాత్మకతపై ప్రభావాన్ని బాగా అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తాయి. సామాజిక ఆమోదం కీలకమయ్యే కౌమారంలో సోషల్ మీడియా ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. చిన్న వీడియోలు, ఆటోప్లే, అంతులేని స్క్రోల్, అల్గారిథమిక్ సిఫార్సులు, లైక్‌లు, కామెంట్లు వేగంగా, అనూహ్యంగా వచ్చే బహుమతుల సమస్యలు సృష్టిస్తాయి. ఈ 'వేరియబుల్ రీఇన్‌ఫోర్స్‌మెంట్' పదేపదే తనిఖీ చేయడాన్ని ప్రోత్సహించి, ఒకే పనిపై ఏకాగ్రత నిలపడాన్ని దూరం చేయొచ్చు; 'డిజిటల్' అందుబాటులో ఉన్నప్పుడు, ముఖాముఖి సంభాషణ, నైపుణ్యాభ్యాసం, సొంత ఆలోచనలతో కూర్చోవడం వంటి సాధారణ అనుభవాలు తక్కువ ఆనందాన్నిస్తాయి.

ఏఐ ఈ చర్చను మరో మలుపు తిప్పింది. మానసిక శ్రమను తగ్గించడానికి మనిషి ఎప్పటినుంచో సాధనాలను వాడుతున్నాడు, అది సమస్య కాదు. కానీ ఏఐ మానసిక శ్రమకు తోడ్పడటమే కాదు, దాని స్థానాన్నే ఆక్రమించగలదు. విద్యార్థులు ఇప్పుడు ఆలోచనలు, వాదనలు, వ్యాసాలు, సారాంశాలను ఏఐతో తయారు చేస్తున్నారు. ఆలోచనాత్మకంగా వాడితే ఇవి అభ్యసనాన్ని మెరుగుపరుస్తాయి, కానీ స్వతంత్ర ఆలోచనకు ప్రత్యామ్నాయంగా వాడితే జ్ఞానం, నైపుణ్యాలు పెరిగే మానసిక శ్రమనే బలహీనపరుస్తాయి. కఠిన ప్రశ్నలతో పోరాడటం, సరైన పదాలు వెతకడం, తప్పులు చేయడం, వాదనలను సవరించడం నేర్చుకోవడానికి మూలం. ఏఐ ఈ అనుభవాలను తొలగిస్తే, యువత విమర్శనాత్మకంగా ఆలోచించే, సమాధానాలు వెంటనే దొరకనప్పుడు పట్టుదల చూపే సామర్థ్యంపై ప్రభావం ఏమిటన్నది అడగాల్సిన ప్రశ్న. అలాగే సాంకేతికత ఖాళీ క్షణాలనూ భర్తీ చేస్తే, విసుగు ఇచ్చే ఊహ, ఆలోచన, సృజనాత్మకతకు చోటు తగ్గుతుంది. ఒకరకంగా, ప్రపంచవ్యాప్తంగా యువత, డిజిటల్ సాంకేతికతకు దీర్ఘకాలం గురికావడం ఎదుగుతున్న మెదడును ఎలా తీర్చిదిద్దుతుందనే విషయంలో విస్తారమైన, చాలావరకు నియంత్రణ లేని ప్రయోగంలో పాల్గొంటున్నారు; ఈ సాధనాలను రూపొందించే సంస్థలకు యువతను నిమగ్నంగా ఉంచడానికి బలమైన ఆర్థిక ప్రోత్సాహకాలు ఉన్నాయి. భారత్‌లో విధానపరమైన కదలిక వేగంగా సాగుతోంది. సెప్టెంబర్ 28న కేంద్రం సుప్రీంకోర్టుకు, 18 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా ఖాతాలు తెరవకుండా వేదికలను నిరోధించేలా ఐటీ నిబంధనలను సవరిస్తామని తెలిపింది. మైనర్లు ఒప్పందాలు చేసుకోలేరని చెప్పే కాంట్రాక్ట్ చట్టం సెక్షన్ 11 ఆధారంగా ఈ పిటిషన్ సాగింది; విచారణ నాలుగు వారాల్లో మళ్లీ రానుంది. ఈ ఏడాది మార్చిలో కర్ణాటక 16 ఏళ్లలోపు వారిపై, ఆంధ్రప్రదేశ్ 13 ఏళ్లలోపు వారిపై ఆంక్షలను ప్రకటించాయి; ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు వారికి నిషేధం అమల్లో ఉంది. అయితే ఇవి ఎంతవరకు ప్రభావవంతమన్నది చర్చనీయాంశం: ఆస్ట్రేలియాలో నిషేధం తర్వాత చాలామంది పిల్లలు సోషల్ మీడియా వాడుతూనే ఉన్నారన్న నివేదికలు ఉన్నాయి, వయసు ధృవీకరణ కోసం అదనపు వ్యక్తిగత సమాచారం సేకరించడం గోప్యత ఆందోళనలను పెంచుతుంది.

ఈ చర్చలో తరచూ విస్మరించబడే మరో ముప్పు: యువతను లక్ష్యంగా చేసుకునే, వారినే సాధనాలుగా మార్చుకునే ఆన్‌లైన్ మోసాలు. ఐ4సీ గణాంకాలను ఉటంకించిన ఒక నివేదిక ప్రకారం, 2025లో 21.77 లక్షల మోసాల ఫిర్యాదులు నమోదై, రూ.19,813 కోట్ల నష్టం నివేదితమైంది; ఫిర్యాదుల్లో 36 శాతం పెట్టుబడి మోసాలు, 19 శాతం సెక్స్‌టార్షన్ (బ్లాక్‌మెయిల్), 6 శాతం 'డిజిటల్ అరెస్ట్'; సుమారు 45 శాతం ఫిర్యాదుల మూలాలు కంబోడియా, మయన్మార్, లావోస్‌లోని నెట్‌వర్కులకు చేరతాయని ఆ నివేదిక అంచనా. యువత ఇందులో బాధితులు మాత్రమే కాదు; నకిలీ ఉద్యోగ ప్రకటనలు, ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా వారి బ్యాంకు ఖాతాలను 'మ్యూల్' ఖాతాలుగా వాడుకుంటున్నారు: బెంగళూరులో ఒక ఇంజినీరింగ్ విద్యార్థి ఖాతా ద్వారా సుమారు రూ.7 కోట్లు తిరిగాయి, హైదరాబాద్ పోలీసులు విద్యార్థులు, డెలివరీ కార్మికుల నుంచి 60-70 ఖాతాలను సేకరించిన నెట్‌వర్క్‌ను బయటపెట్టారు. సాంకేతికత ఇంత అడ్వాన్స్ అయినా మోసాలను ఎందుకు అదుపు చేయలేకపోతున్నాం? సొమ్ము నిమిషాల్లో అనేక మ్యూల్ ఖాతాల పొరల గుండా కదులుతుంది; నెట్‌వర్కులు విదేశాల నుంచి నడుస్తాయి; యూపీఐకి ఫిర్యాదు చేసే లోపే డబ్బు మాయమవుతుంది; ఏఐ మోసాలను మరింత నమ్మకంగా మారుస్తోంది; నియమాలు తెలియని యువత సులభంగా ఉచ్చులో పడుతుంది. ఈ ఏడాది మేలో ఐ4సీ, ఆర్‌బీఐ ఇన్నోవేషన్ హబ్ మధ్య ఏఐతో మ్యూల్ ఖాతాలను పసిగట్టే ఒప్పందం కుదిరింది; ఇవి మంచి అడుగులే, కానీ నష్టంతో పోలిస్తే రికవరీ, శిక్షల వేగం ఇంకా తక్కువే. అందుకే పరిష్కారం బహుముఖంగా ఉండాలి. తల్లిదండ్రులకు ఆచరణాత్మక మార్గదర్శకం కావాలి: పిల్లలకు ఫోన్‌లు లేని సమయాలు, ప్రదేశాలు, రక్షిత అధ్యయన వేళలు, ఆరోగ్యకరమైన నిద్ర, ప్రణాళిక లేని సమయం; లక్ష్యం తెరలను తొలగించడం కాదు, అవి ప్రతి క్షణాన్ని ఆక్రమించకుండా చూడటం. పాఠశాలలు ఆలోచించడం, రాయడం, తర్కించడంలో ఉండే "ఉత్పాదక కష్టాన్ని" కాపాడాలి; మౌఖిక పరీక్షలు, పర్యవేక్షణలో రాయడం వంటివి పెంచాలి. యువత లక్ష్యంగా ఉన్న వేదికలపై ఎక్కువ జవాబుదారీతనం ఉండాలి; తమ ఉత్పత్తులు పిల్లల వికాసాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో బలమైన సాక్ష్యాలు ఇవ్వాలని కంపెనీలను కోరాలి, స్వతంత్ర పరిశోధనకు ప్రభుత్వాలు మద్దతివ్వాలి. అలాగే "మీ బ్యాంకు ఖాతాను ఎవరికీ అద్దెకు ఇవ్వకండి" అనే హెచ్చరికలు, 1930 హెల్ప్‌లైన్ సమాచారం పాఠశాలలు, కళాశాలల్లో చేరాలి. యువ మనసుకు ఉద్దీపన కావాలి, కానీ నిశ్శబ్దమూ కావాలి; సమాచారం కావాలి, కానీ ఆలోచనా కావాలి; సహాయం కావాలి, కానీ పోరాటమూ కావాలి. సాంకేతిక పురోగతిని స్వీకరిస్తూనే, పిల్లలు ఆలోచించడం, ఊహించడం, ఎదగడం నేర్చుకునే అనుభవాలను కాపాడుకోవాలి. ■



**మనిషి జీవితం ఒక్కరోజులో మారిపోదు.. అలాగే ఒక్కరోజులో పాడైపోదు. వ్యాయామాన్ని ఈ రోజుకు వాయిదా వేయడం, చేయాల్సిన పనిని రేపటికి నెట్టేయడం, సమయాన్ని వృథా చేసే అలవాట్లను చిన్నవిగా భావించడం.. ఇవన్నీ క్రమంగా మన ఎదుగుదలను దెబ్బతీస్తాయి. అలాగే రోజూ చేసే చిన్న మంచి పనులే రేపటి విజయానికి పునాదులవుతాయి. గుర్తుంచుకోండి.. మన భవిష్యత్తును నిర్ణయించేవి అప్పుడప్పుడు తీసుకునే గొప్ప నిర్ణయాలు మాత్రమే కాదు.. ప్రతిరోజూ మనం అలవాటుగా చేసే చిన్న చిన్న పనులు కూడా!**

-మహాదేవ

### వింతల్లో వింతలు

## పంది మాంసం ముద్దకు 'కళ' పట్టం!



అమెరికాలోని ఫిలడెల్ఫియా రీడింగ్ టెర్మినల్ మార్కెట్‌లో మూడో వార్షిక 'స్క్రాపుల్ శిల్ప పోటీ' జరిగింది. స్క్రాపుల్ అంటే పంది మాంసం ముక్కలు, అవయవాలతో తయారుచేసే అల్పాహార ముద్ద! 12 మంది ఔత్సాహికులు, ఒక్కొక్కరికి 6 పౌండ్ల (సుమారు 2.7 కిలోల) స్క్రాపుల్ బ్లాక్, 90 నిమిషాల సమయం ఇచ్చారు; థీమ్ మార్కెట్టే. ఒక పోటీదారు దాన్ని లెబ్రాన్ జేమ్స్ జెర్సీగా మలిచింది. జ్యూరీ ఓటు మార్కెట్ మస్కట్ 'ఫిల్బర్ట్' అనే పంది శిల్పం చేసిన టోనీ లీకి దక్కింది. విజేతలకు ట్రోఫీ, స్వాగ్ బ్యాగ్, 100 డాలర్ల గిఫ్ట్ కార్డ్! ప్రజల ఓటు శనివారం ఉత్సవంలో. పందిని తిన్నాక, పందినే శిల్పంగా చూడటం ఫిలడెల్ఫియా ప్రత్యేకత!

# ఈ కాలుష్యం చాలా డేంజర్.. సంతాన లోపం, కిడ్నీ సమస్యలు.. ప్రమాదాలెన్నో





కాలుష్యం.. ప్రపంచమంతటినీ వణికిస్తున్న భూతమిది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ కాలుష్యం పెరిగిపోతూనే ఉంది. మానవ మనుగడపై ప్రభావం చూపుతూనే ఉంది. గుండె సంబంధిత జబ్బులతో సంభవిస్తున్న మరణాల్లో 75 శాతం, ఊపిరితిత్తుల వ్యాధులతో జరుగుతున్న మరణాల్లో 25 శాతం కేవలం గాలి కాలుష్యం కారణంగానేనని ఇప్పటికే పరిశోధకులు నిర్ధారించారు. ముఖ్యంగా భారత్, చైనా దేశాలతో కూడిన ఆసియా ఖండం ప్రాంతంలో కాలుష్యం కారణంగా మరణాలు మరింత ఎక్కువని గుర్తించారు. అంతేకాదు కాలుష్యం కారణంగా వంధ్యత్వం, ఎముకలు గుల్లబారిపోవడం వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక సమస్యలూ తలెత్తుతాయని తాజాగా పలు పరిశోధనల్లో తేల్చారు. మరి ఈ ప్రమాదాలు, వాటిని నివారించే మార్గాలు తెలుసుకుందాం..

**వంటగది నుంచి వాహనాల పొగ దాకా..**

వాయు కాలుష్యం నేడు ప్రపంచాన్ని వణికిస్తున్న అతి పెద్ద సమస్య. మనకుకనిపించే కాలుష్యం పొగ గొట్టాల నుంచి, శిలాజ ఇంధనాల దహనం నుంచి, వాహనాలు తదితర వాటి నుంచి ఎక్కువగా వెలువడుతోంది. వీటి వల్ల అతి ప్రమాదకరమైన గోధుమ రంగు పొగ మంచు (బ్రౌన్ హెజ్) వాతావరణంలో ఏర్పడుతోంది. ఇది మనిషిఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనదని అమెరికన్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

శిలాజ ఇంధనాలు అంటే పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటి వాటిని మండించినప్పుడు అతి సూక్ష్మమైన కణాలు (అల్ట్రా ఫైన్ పార్టికల్స్) వెలువడుతాయి.

వీటి నుంచే కాకుండా గ్యాస్ ఆధారిత వాహనాల నుంచి వచ్చే పొగ, గడ్డిని కోసే యంత్రాలు (లాన్ మూవర్స్), కట్టెలను కాల్చడం, ఎండిపోయిన ఆకులను కాల్చులడం, స్మోకింగ్ ద్వారా కూడా అల్ట్రాఫైన్ పార్టికల్స్ గాలిలో కలుస్తున్నాయి.



ఇవి ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమైనవి.

అంతేకాకుండా వంట గదిలో చికెన్, మటన్ వంటకాలు చేసేటప్పుడు కూడా ఈ కణాలు వెలువడుతున్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

ఇవి వేగంగా గాలిలో కలిసిపోతాయని, తర్వాత ఒకదానికొకటి కలసి పెద్ద కణాలుగా మార్పు చెందుతాయని గుర్తించారు. ఈ అల్ట్రాఫైన్ పార్టికల్స్ రహదారుల పక్కన ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.

**సంతాన సామర్థ్యం తగ్గిపోవడం**

గాలిలో అత్యధిక కాలుష్యం కారణంగా పురుషుల్లో వంధ్యత్వ సమస్య తలెత్తుతోందని తైవాన్ కు చెందిన పరిశోధకులు తేల్చారు. కాలుష్యం వల్ల పురుషుల్లో వీర్య కణాల నాణ్యత తగ్గిపోతోందని గుర్తించారు. 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న దాదాపు 6,500 మంది పురుషుల్లో వీర్య కణాల ఉత్పత్తి, వాటి పరిస్థితి, క్రియాశీలత తదితర అంశాలపై మూడు నెలల పాటు అధ్యయనం చేశారు. ఈ ఫలితాలను రెండేళ్ల సమయానికి అన్వయించి.. అంచనాలను రూపొందించారు.

గాలిలో చేరే పర్టిక్యులేట్ మేటర్ (%పీ%) అత్యధిక స్థాయిల్లో పీల్చడం వల్ల వీర్య కణాల ఆకారం, పరిమాణం అసాధారణంగా మారిపోయినట్లు పరిశోధకులు గుర్తించారు. (పర్టిక్యులేట్ మేటర్ అంటే గాలిలో చేరే అతి సూక్ష్మ రసాయన కణాలు, దుమ్ము, ధూళి కణాలు).

అయితే వారిలో వీర్య కణాల సంఖ్య మాత్రం తగిన సంఖ్యలోనే ఉన్నట్లు నిర్ధారించారు. కానీ వాటి సామర్థ్యం లోపించడం కారణంగా.. ఈ వీర్య కణాలు గర్భధారణ కోసం పనికిరానివిగా మారిపోతున్నాయని తేల్చారు.

**ఎముకలు గుల్లబారి విరిగిపోవడం**

ఆస్టియో పోరోసిస్.. అంటే ఎముకల కణాల్లో సాంద్రత తగ్గి గుల్లబారిపోయే సమస్య. దీనివల్ల ఎముకల్లో పటుత్వం తగ్గిపోయి చిన్న దెబ్బ తగిలినా విరుగుతాయి. సాధారణంగా వయసు మీద పడిన కొద్దీ ఎముకల్లో పటుత్వం తగ్గుతూ ఆస్టియో పోరోసిస్ సమస్య తలెత్తుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా ఆస్టియో పోరోసిస్ కారణంగా సుమారు 89 లక్షల మంది ఎముకలు విరిగే సమస్య (కాళ్లు, చేతులు, ఇతర భాగాల్లో ఎముకలు విరగడం) బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ ఫౌండేషన్ లెక్కతేల్చింది. అయితే గాలి కాలుష్యం ఈ ఆస్టియోపోరోసిస్ సమస్య మరింతగా పెరగడానికి కారణమవుతోందని అమెరికన్ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గాలి కాలుష్యానికి గురైనప్పుడు శరీరంలో పారా థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతోందని, ఇది ఆస్టియో పోరోసిస్ కు దారి తీస్తోందని గుర్తించారు. ది లాన్సెట్: ప్లానెటరీ హెల్త్ జర్నల్ లో వారి అధ్యయన నివేదిక ప్రచురితమైంది.

**అమెరికన్ శాస్త్రవేత్తలు రెండు దశల్లో ఈ అధ్యయనం చేశారు.**

తొలి దశలో కాలుష్యం ఎక్కువగా ఉండే ఒక ప్రాంతాన్ని, కాలుష్యం అతి తక్కువగా ఉండే మరో ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఈ ప్రాంతాల్లో 65 ఏళ్లు పైబడిన 92 లక్షల మందికి సంబంధించిన వైద్య రికార్డులను పరిశీలించారు. 2003 నుంచి 2010 వరకు ఏడేళ్లకు సంబంధించిన డేటాను సేకరించి విశ్లేషించారు. ఏయే ప్రాంతంలో ఏ సమయంలో ఎంత మంది ఎముకలు విరిగిన సమస్యతో బాధపడింది లెక్కించారు. ఆయా సమయాల్లో ఏ ప్రాంతంలో ఎంత గాలి కాలుష్యం నమోదైంది పోల్చి చూశారు. మొత్తంగా కాలుష్యం స్థాయి అధికంగా నమోదైన ప్రాంతాలకు చెందినవారిలో ఆస్టియోపోరోసిస్ సమస్య ఎక్కువగా ఉందని, ఎముకలు విరిగే సమస్య కూడా ఎక్కువగా ఉందని గుర్తించారు.

ఇక శాస్త్రవేత్తలు రెండో దశలో వాహనాల కాలుష్యం అత్యధికంగా ఉండే ఓ పట్టణ ప్రాంతాన్ని ఎంచుకుని పరిశోధన చేశారు. 35 ఏళ్ల నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న 692 మంది పురుషులకు సంబంధించి.. కొన్నేళ్ల వైద్య రికార్డులను పరిశీలించారు. కాలుష్యం తక్కువగా ఉండే ప్రాంతాల వారితో పోల్చితే.. కాలుష్యం అధికంగా ఉన్న ఈ పట్టణ ప్రాంతాల వారిలో పారా థైరాయిడ్ హార్మోన్ స్థాయి తక్కువగా ఉందని, ఆస్టియో పోరోసిస్ సమస్య అధికంగా ఉందని గుర్తించారు. శరీరంలో ఎముకల నిర్మాణం, ఎముకలు పటిష్టంగా ఉండడం కోసం పారాథైరాయిడ్ హార్మోన్ కీలకంగా పనిచేస్తుంది. ఇది తక్కువగా ఉండడం కారణంగా ఎముకలు గుల్లబారుతాయి.

**పక్షవాతం ముప్పు కూడా..**

గాలి కాలుష్యం కారణంగా పక్షవాతం వచ్చే ముప్పు కూడా పెరుగుతోందని అమెరికన్ శాస్త్రవేత్తలు ఇటీవలి ఓ అధ్యయనంలో తేల్చారు. పక్షవాతం, దాని సంబంధిత సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 లక్షల మంది మరణిస్తున్నట్లు అంచనా. దీని బారినపడి ఎంతో మంది శారీరక వైకల్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు పక్షవాతానికి, కాలుష్యానికి మధ్య సంబంధంపై పరిశోధన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 28 దేశాలకు చెందిన 62 లక్షల మంది పక్షవాతం బాధితులపై జరిగిన 94 అధ్యయనాలను ఒక చోట క్రోడీకరించి పరిశీలించారు. 1948 నుంచి 2014 మధ్య సుదీర్ఘంగా జరిగిన ఆ అధ్యయనాల ఆధారంగా.. పక్షవాతం సమస్యలకు, గాలిలో హానికర రసాయనాలు, పర్టిక్యులేట్ మేటర్ స్థాయిలకు మధ్య సంబంధమున్నట్లు గుర్తించారు.

విపరీతంగా గాలి కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో చిన్న వయసులోనే పక్షవాతం బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనంలో నిర్ధారించారు.

ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని.. ఇతర సమస్యలతో పాటు గాలి కాలుష్యం కూడా తోడై బ్రెయిన్ స్ట్రోక్ వంటివాటికి కారణమవుతోందని వారు చెబుతున్నారు.

**కిడ్నీల పనితీరుకు దెబ్బ**

విపరీతంగా గాలి కాలుష్యానికి లోనవుతున్న వారిలో మూత్రపిండ (కిడ్నీ) సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు అమెరికన్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ శాస్త్రవేత్తలు గుర్తించారు. గాలిలోని కలుషితాలు ఊపిరితిత్తుల ద్వారా రక్తంలోకి చేరుతున్నాయని, ఆ కలుషితాలను తొలగించే క్రమంలో కిడ్నీలు దెబ్బతింటున్నాయని తేల్చారు. వారు ఈ అంశంపై చాలా పెద్ద పరిశోధనే చేశారు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు చెందిన శాటిలైట్ల ద్వారా పలు ప్రాంతాల్లో గాలి కాలుష్యం స్థాయిలను లెక్కించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నివసించే సుమారు 20 లక్షల మందికి సంబంధించిన వైద్య రికార్డులను విశ్లేషించారు.

గాలి కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత సమస్యలు ఏటేటా బాగా పెరిగిపోతున్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

అత్యధిక కాలుష్యం స్థాయిలే కాదు.. కొంచెం కాలుష్యంతోనూ కిడ్నీల పనితీరుపై ప్రభావం పడుతుందని.. కాలుష్యం స్థాయిని బట్టి సమస్యల తీవ్రత ఉంటుందని అమెరికాకు చెందిన సెయింట్ లూయిస్ హెల్త్ కేర్ సిస్టమ్ డైరెక్టర్ జియాద్ అల్లీ పేర్కొన్నారు.

**కాలుష్యంతో అధిక రక్తపోటు ముప్పు...**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కమ్ముకుంటున్న సమస్యల్లో అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఒకటి. కాలుష్యం కారణంగా కూడా ఈ సమస్య మరింతగా ఉధృతమవుతున్నట్లు యురోపియన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకోసం స్పెయిన్, జర్మనీ, డెన్మార్క్, స్వీడన్, నార్వే తదితర దేశాలకు చెందిన 41 వేల మందిపై 2008 నుంచి 2015 వరకు పరిశోధన చేశారు. సర్వే కోసం ఎంచుకున్న సమయంలో వారెవరికీ కూడా అధిక రక్తపోటు సమస్య లేదు. అనంతరకాలంలో 15 శాతం మందికి ఈ సమస్య తలెత్తింది. అధ్యయనం చేసిన వారిలో అధిక రక్తపోటు సమస్య తలెత్తిన వారి వివరాలను పరిశీలించగా.. వారంతా గాలి కాలుష్యం అధికంగా ఉండే ప్రాంతాల్లోనే నివసిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

గాలిలో రసాయన కలుషితాలు, పర్టిక్యులేట్ మేటర్ ఊపిరితిత్తుల ద్వారా శరీరంలో చేరి ఆరోగ్య సమస్యలను తలెత్తుతున్నాయని, అధిక రక్తపోటు సమస్యకు దారి తీస్తోందని పరిశోధనకు నేతృత్వం వహించిన జర్మనీ హెన్రిచ్ హేయిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బార్బరా హోఫ్ మన్ వెల్లడించారు.

**గర్భస్త శిశువుల ఎదుగుదలపై ప్రభావం**

గాలిలో ఉండే హానికరమైన, విషపూరిత రసాయనాలు గర్భస్థ శిశువుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయని అమెరికన్ పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా గర్భం తొలి దశలో అంటే ఒకటో నెల నుంచి మూడో నెల వరకు ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ జేసన్ బ్లమ్ నేతృత్వంలోని బృందం దీనిపై పరిశోధన చేసింది. అమెరికాలోని పలు ప్రాంతాల్లో చిన్నారులకు జన్మనిచ్చిన మహిళల వైద్య రికార్డులను, ఆయా ప్రాంతాల్లో కాలుష్యం స్థాయిలను వారు విశ్లేషించారు. దీంతోపాటు ప్రయోగశాలలోనూ గర్భస్థ ఎలుకలపై పరిశోధన చేశారు.

కాలుష్యం కారణంగా గర్భంలో పిండం ఎదుగుదల దెబ్బతింటుందని, నెలలు నిండకముందే కాన్పు జరుగుతుందని పరిశోధనలో తేలినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ముఖ్యంగా గర్భం తొలిదశలో అంటే తొలి మూడు నాలుగు నెలల పాటు తీవ్ర స్థాయిలో కాలుష్యానికి గురైతే.. బిడ్డ చాలా తక్కువ బరువుతో జన్మిస్తున్నట్లుగా వెల్లడైంది.

**కలుషితాలతో మానసిక సమస్యలు**

కలుషితమైన గాలి కారణంగా శారీరక సమస్యలే కాదు.. మానసిక సమస్యలూ తలెత్తుతున్నట్లు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ పరిశోధకులు తేల్చారు. దీనిపై అమెరికాలోని పలు ప్రాంతాల్లో గాలి కాలుష్యం డేటాను సేకరించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యం రికార్డులతో సరిపోల్చి విశ్లేషించారు. కాలుష్యం తక్కువగా ఉన్న ప్రాంతాలతో పోలిస్తే.. ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని వారు 17 శాతం ఎక్కువగా మానసిక సమస్యలు, ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు.

ఇక పురుషులతో పోలిస్తే.. మహిళలపై గాలి కాలుష్యం ఎక్కువ ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. వీరు ఏకంగా 39 శాతం మంది మానసిక ఒత్తిళ్లతో బాధపడుతున్నట్లు తేల్చారు.

గాలిలోని కలుషితాలు.. మనలో ఒత్తిడిని పెంచే హార్మోన్లు ఎక్కువగా విడుదలవడానికి కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికితోడు కలుషితమైన గాలి కారణంగా వచ్చే శ్వాస సమస్యలు, చర్మ సమస్యలు వంటివి కూడా ఒత్తిడిని పెంచుతున్నాయని పేర్కొంటున్నారు.

**అన్నీ కలసి గుండె జబ్బులు**

గాలిలో కలుస్తున్న వాహనాల పొగ, ఫాక్టరీలు, ఇతర కలుషితాల కారణంగా గుండె పోటు, కవాటాలు, రక్తనాళాలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నట్లు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ హెచ్చరిస్తోంది. ఆల్కాహాల్, కాఫీ వంటి వాటి అతి వినియోగం కారణంగా గుండె పోటు వచ్చే ప్రమాదం ఎంతగా ఉందో.. గాలి కాలుష్యం కారణంగా అంతే ప్రమాదం ఉందని స్పష్టం చేస్తోంది. ఇందుకోసం అమెరికన్ హార్ట్ అసోసియేషన్ శాస్త్రవేత్తలు 1960 నుంచి 2010 మధ్య జరిగిన 36 అధ్యయనాల ఫలితాలను క్రోడీకరించి పరిశీలించారు.

మొత్తంగా సంభవిస్తున్న గుండెపోటు ఘటనల్లో 5 నుంచి 7 శాతం వరకు గాలి కాలుష్యమే కారణమని వెల్లడైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ముఖ్యంగా ఇతర జబ్బులతో బాధపడుతున్నవారు గాలి కాలుష్యానికి లోనైతే గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

# ఫోన్ లేకుండా ఓ పది నిమిషాలు




మీరు క్యూలో నిల్చున్నప్పుడు ఫోన్ వంక చూడకుండా ఉన్నది చివరిసారి ఎప్పుడో గుర్తుందా? లేదా టీ తాగుతూ రీల్స్ స్క్రోల్ చేయకుండా ఎప్పుడు ఉన్నారో చెప్పగలరా? కారులో కూర్చొని, ఎవరి కోసమో వేచి చూస్తున్నప్పుడు ఏమీ తోచక ఇన్స్టాగ్రామ్ ఓపెన్ చేయని సందర్భమైనా జ్ఞాపకముందా? అయితే ఈరోజు ప్రయత్నించండి. ఫోన్‌ను ఓ 10 నిమిషాలు పక్కన పెట్టేయండి. ఆ కాసేపు ఫోన్‌తో ఏమీ చేయకుండా ఉండటానికి ప్రయత్నించండి.

ఫోన్‌ను కాసేపు పక్కనపెట్టటం తేలికైందనే అనిపిస్తుంది కానీ చాలామందికి సాధ్యమయ్యే పని కాదు. రెండు నిమిషాలు చేతిలో ఫోన్ లేకపోతే ఎక్కడలేని గాబరా పుట్టుకొస్తుంది. ఎవరైనా మెసేజ్ చేశారేమోననే సందేహం మనసును తొలుస్తుంది. లేకపోతే తాజా వార్తలేంటో తెలుసుకోవాలనే తహతహ పుడుతుండొచ్చు. యథాలాపంగా టైమ్ చూస్తుండొచ్చు. ఏమీ తోచక యాప్ తెరుస్తుండొచ్చు. అవును.. ఫోన్ అంతలా మన నిత్య వ్యవహారాల్లోకి చొచ్చుకొచ్చింది. ఇది ఒకరకంగా మన జీవితాల్లోంచి బోర్ అనే పదాన్నే తుడిచి పెట్టిందన్నా అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే బోర్ కొట్టకముందే ఫోన్‌ను ఓపెన్ చేస్తుంటాం మరి. ఇక్కడ సమస్య ఫోన్ కాదు. నిరంతరం మన మెదడుకు ఏదో ఒక ప్రేరణ కావాల్సి ఉండటమే. నిజానికి స్మార్ట్‌ఫోన్ వాడకంలో ఎలాంటి తప్పూ లేదు. ఉద్యోగ వ్యవహారాలు, సమాచారం ఇచ్చి పుచ్చుకోవటం, ఆయా విషయాలు నేర్చుకోవటం, ఇతరులతో అనుసంధానం కావటం.. ఇలా రకరకాల అవసరాలకు దీన్ని వాడుతూనే ఉంటాం. అయితే ఏ చిన్న ఖాళీ దొరికినా, దాన్ని అప్పటికప్పుడు పూరించుకోవాలనే యావతోనే సమస్య మొదలవుతుంది. లిఫ్ట్ కోసం వెయిట్ చేస్తున్నా ఫోన్ వంక చూస్తుంటాం. టీ ఆర్డర్ చేసి, అది వచ్చేలోపు స్క్రోలింగ్ చేస్తుంటాం. టీవీ చూస్తూ కూడా మెసేజ్‌ల కోసం వెతుకుతుంటాం. చివరికి ఏమాత్రం బోర్ కొట్టినా ఏదో ఓ యాప్ తెరుస్తుంటాం.

**అంతా మెదడు మాయ**

మన మెదళ్లు సహజంగానే కొత్తదనం వైపు మొగ్గుతుంటాయి. ఓ నోటిఫికేషనో, కొత్త మెసేజో లేదా తాజా వీడియోనో దాన్ని ఆకట్టుకుంటుంది. దానికి స్పందించాలనే కోరిక కలిగిస్తుంది. తరచూ ఇలాగే జరుగుతూంటే ఫోన్‌ను చెక్ చేయటం దానంతటదే సాగిపోతుంటుంది. అందువల్ల ఎంతసేపు ఫోన్‌తో గడుపుతున్నారనేదే కాదు, ఎంత తరచుగా దాన్ని చెక్ చేస్తున్నారన్నదీ ముఖ్యమే. చిన్న ఉదాహరణ చూద్దాం. ఏదో ముఖ్యమైన పని చేస్తుంటాం. కానీ మాటిమాటికీ వాట్సప్‌ను చెక్ చేస్తుంటాం. మధ్యమధ్యలో ఈమెయిళ్లకు జవాబిస్తుంటాం. నోటిఫికేషన్ల వంక చూస్తుంటాం. తిరిగి అసలు పనిలోకి మళ్లుతుంటాం. ఈ క్రమంలో ఫోన్‌తో గడిపిన సమయం అంత ఆందోళన కలిగించేది కాదనే అనిపిస్తుంది. కానీ తరచూ ఏకాగ్రతకు భంగం వాటిల్లుతూనే ఉంటుంది. చివరికిది స్థిరమైన ఏకాగ్రతను కూడా ఓ అసౌకర్యంగా భావించే స్థితికి చేరుస్తుంది. కాబట్టి ఎన్ని గంటలు ఫోన్‌తో గడుపుతున్నారని కాకుండా ఎంత తరచుగా ఏకాగ్రతకు భంగం కలుగుతోంది? అని ప్రశ్నించుకోవటం మంచిది. అప్పుడే 'ఫోన్ సమస్య' బయటపడుతుంది.

స్క్రీన్ చూడకపోతే?

తొలి నిమిషాల్లో మెదడులో రకరకాల ఆలోచనలు ముసురుకుంటాయి. గత అసంపూర్ణ చర్చలు గుర్తుకురావొచ్చు. రేపటి సమావేశాలు, పూర్తి కాని పనులు లేదా బాధపెట్టే విషయాలేవైనా జ్ఞాపకం రావొచ్చు. ఊరికే పగటి కలలు కన్నా కనొచ్చు. చాలాసార్లు మనం మనశ్శాంతి అంటే మనసు ఖాళీగా ఉండటమని అనుకుంటుంటాం. నిజానికి మనసు ఎప్పుడూ ఖాళీగా ఉండదు. బయటి నుంచి నిరంతరం సమాచారం అందటం ఆగినప్పుడు మనసు సహజంగానే అంతర్ముఖం అవుతుంది. లోలోపల దాగిన జ్ఞాపకాలు, ప్రణాళికలు, భావోద్వేగాలు, ఆలోచనల వైపు మళ్లుతుంది. దీన్ని అతిగా ఆలోచించటంగా భావించాల్సిన పనిలేదు. సాధారణ మానసిక చర్యలో భాగమే. కొన్నిసార్లు మనం నిజంగా ఆలోచించే వాటిని, భావోద్వేగాలను గుర్తించటానికి అవకాశం ఇవ్వకుండా చాలా త్వరగా పరధ్యానంలో పడుతుంటామనే విషయం మరవరాదు.

**చిన్నపాటి పరీక్ష**

ఉన్నట్టుండి ఫోన్‌ను పక్కన పెట్టేయటమంటే కష్టమే. కానీ చిన్న చిన్న ప్రయత్నాలు పెద్ద ప్రభావమే చూపిస్తాయి. ఉదాహరణకు ఉదయం కాఫీ తాగేటప్పుడు ఫోన్ పక్కన లేకుండా చూసుకోవచ్చు. బాల్కనీలో కూర్చొని ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించొచ్చు. హెడ్‌ఫోన్లు లేకుండా వ్యాహ్యాళికి వెళ్లొచ్చు. ఓ 10 నిమిషాలు జేబులోకి చేయి వెళ్లకుండా నిలువరించుకునే ప్రయత్నించొచ్చు. ఇలాంటి సమయంలో ఆలోచనలకు అడ్డుకట్ట వేయాలని అనుకోవద్దు. వాటిని గమనిస్తూ సాగితే చాలు. కొందరికి ఊహించిన దాని కన్నా ఎక్కువ గాబరా కలుగుతున్నట్టు అనిపించొచ్చు. లేదూ కొద్ది నిమిషాల తర్వాత మనసు కుదుటపడుతున్న భావన కలగొచ్చు. మానసిక ఆరోగ్యమనేది ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకోవటానికి మాత్రమే సంబంధించింది కాదు. మెదడుకు ఒకింత ఖాళీ సమయం లభించేలా చూసుకోవటం కూడా. అప్పుడే బయటి నుంచి అందే ప్రేరణలకు ప్రతిస్పందించటం, వాటి గురించి ఆలోచించటం ఆగుతుంది. ఖాళీ దొరికిన ప్రతిసారీ స్క్రోలింగ్ చేయటం అలవాటైన నేటి సామాజిక మాధ్యమ యుగంలో కొద్దిసేపు ఫోన్‌ను పక్కనపెట్టి, హాయిగా ఉండటం నేర్చుకోగలిగితే అదే మెదడుకు విలువైన అలవాటుగా మారుతుందనటంలో ఆశ్చర్యం లేదు.

# 46 ఫోర్లు, 7 సిక్సులతో విధ్వంసం.. 400 రన్స్ కొట్టిన చిన్మయ్ సుతార్




భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన సంచలనం నమోదు అయింది. రంజీ ట్రోఫీ హిస్టరీలో దాదాపు 78 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ మిజోరాం బ్యాటర్ చిన్మయ్ సుతార్ భారీ రికార్డును నెలకొల్పాడు. నాగాలాండ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శనతో ఏకంగా 400ం పరుగులు సాధించి క్వాడ్రపుల్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఈ ఘనత సాధించడంతో రంజీ ట్రోఫీ చరిత్రలోనే 400 రన్స్ మైలురాయిని తాకిన రెండో బ్యాటర్‌గా చిన్మయ్ చరిత్ర సృష్టించాడు.

**9 వికెట్లు పడిపోయినా ఒంటరి పోరాటం:**

ముంబైలో జన్మించి ప్రస్తుతం మిజోరాం తరఫున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ మైదానంలో చూపించిన పట్టుదల, పోరాటపటిమ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది.

ఒంటరి పోరాటం: తొలి ఇన్నింగ్స్‌లో మిజోరాం జట్టు 392 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి ఆలౌట్ అయ్యే ప్రమాదంలో పడింది. ఆ సమయంలో మిగిలిన బ్యాటర్లు కేవలం 14 రన్స్ మాత్రమే సహకారం అందించినప్పటికీ, సుతార్ మాత్రం సింగిల్స్, బౌండరీలతో మైదానమంతా పరుగులు రాబట్టాడు.

భారీ స్కోరు: చివరి వికెట్‌కు అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి, జట్టు స్కోరును 581/9 (డిక్లేర్డ్) కు చేర్చాడు. మొత్తం 581 పరుగుల్లో చిన్మయ్ ఒక్కడే ఏకంగా 400 పరుగులు సాధించడం విశేషం.

**ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 10వ బ్యాటర్:**

భారత రంజీ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు కేవలం బీబీ నింబాల్కర్ (దీ. దీ. చీఅఎఘ్రీఘీ) మాత్రమే 400 కంటే ఎక్కువ పరుగులు చేశారు. 1948లో కాథియావాడ్‌పై మహారాష్ట్ర తరఫున ఆడుతూ నింబాల్కర్ అజేయంగా 443 రన్స్ కొట్టాడు. ఇప్పుడు దాదాపు ఎనిమిది దశాబ్దాల తర్వాత ఆ రికార్డు సరసన నిలిచిన రెండో భారత బ్యాటర్‌గా చిన్మయ్ నిలిచాడు.

ప్రపంచ ఫస్ట్ క్లాస్ క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 400ం కంటే ఎక్కువ పరుగులు సాధించిన 10వ బ్యాటర్‌గా చిన్మయ్ సుతార్ రికార్డులకెక్కాడు.

**ఇంతకీ ఎవరీ ఈ చిన్మయ్ సుతార్:**

మే 3, 1997న జన్మించిన చిన్మయ్ సుతార్ ముంబైలో పెరిగి, ముంబై జట్టుకే కాకుండా 2019 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భారత్ అండర్ -23 జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం మంచి అవకాశాల కోసం మిజోరాం జట్టులోకి మారిన చిన్మయ్, తన అద్భుతమైన ప్రతిభతో ఇండియన్ డొమెస్టిక్ క్రికెట్‌లో తన ఉనికిని చాటుకున్నాడు.

# స్వర్ణ పతకాలతో దూసుకెళ్తున్న భారత్.. సౌమ్య, రింకు, నిషాద్ అదుర్స్!




జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా పారా గేమ్స్ 2026 లో భారత పారా అథ్లెట్లు సంచలనం సృష్టిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిన అద్భుత విజయాలతో ఇండియా ఖాతాలో పసిడి పతకాలు వచ్చి చేరుతున్నాయి. కేవలం నిమిషాల వ్యవధిలోనే భారత అథ్లెట్లు మూడు స్వర్ణ పతకాలను సాధించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు.

**1500 మీటర్ల పరుగులో సౌమ్య కుమార్‌కి పసిడి:**

మహిళల 1500 మీటర్ల పరుగు పందెంలో తన గైడ్ భారత్ కుమార్ తో కలిసి బరిలోకి దిగిన సౌమ్య కుమార్ అద్భుతమైన టైమింగ్‌తో రేసును ముగించింది. పాయింట్ల ప్రాతిపదికన జరిగిన ఈ హోరాహోరీ పోరులో అగ్రస్థానంలో నిలిచి దేశానికి మరో స్వర్ణ పతకాన్ని అందించింది.

**లాంగ్ జంప్‌లో నిషాద్‌కి గోల్డ్:**

హైజంప్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఉన్న రెండుసార్లు పారాలింపిక్స్ రజత పతక విజేత నిషాద్ కుమార్, తొలిసారి లాంగ్ జంప్ ఈవెంట్‌లో బరిలోకి దిగాడు. ఏమాత్రం తడబడకుండా అద్భుతమైన జంప్ చేసి 7.11 మీటర్ల దూరంతో తొలిసారే పసిడి పతకాన్ని ముద్దాడి సరికొత్త చరిత్ర సృష్టించాడు.

**జావెలిన్ త్రోలో రింకూ సంచలన విజయం:**

పురుషుల ఎఫ్46 జావెలిన్ త్రో ఫైనల్ పోటీ అత్యంత రసవత్తరంగా కొనసాగింది. తోటి భారత అథ్లెట్ అజిత్ సింగ్ చివరి క్షణాల వరకు స్వర్ణ పతకం సాధించేలా కనిపిపించినప్పటికీ, చివరి ప్రయత్నంలో అద్భుతమైన త్రో విసిరిన రింకూ అనూహ్యంగా అజిత్ సింగ్‌ను వెనక్కి నెట్టి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుని స్టేడియాన్ని హోరెత్తించాడు.

# బ్యాక్ టు బ్యాక్ సెంచరీలు.. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అదరగొట్టిన రింకు సింగ్.. భారత జట్టులో చోటు దక్కేనా?

టీ20 క్రికెట్‌లో తన సిక్సర్లతో ప్రపంచవ్యాప్తంగా ది బెస్ట్ ఫినిషర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఉత్తరప్రదేశ్ స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ , ఇప్పుడు రెడ్ బాల్ (ఫస్ట్ క్లాస్) క్రికెట్‌లోనూ అద్భుతమైన ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. రంజీ క్రికెట్లో 2026-27 సీజన్‌లో వరుసగా రెండో సెంచరీ సాధించాడు. గోవాతో జరిగిన రంజీ మ్యాచ్‌లో ఒంటరిగా రింకూ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కనీసం 50 ఇన్నింగ్స్‌లు ఆడిన బ్యాటర్లలో అత్యధిక బ్యాటింగ్ యావరేజ్ ఉన్న టాప్-10 ప్లేయర్స్ లిస్టులో 9వ స్థానానికి ఎగబాకాడు. ఈ ఆల్-టైమ్ గ్రేట్ జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

**గోవాతో మ్యాచ్‌లో ఒంటరి పోరాటం:**

గోవాతో జరిగిన రంజీ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ టీమ్ బ్యాటింగ్ విభాగం ఘోరంగా విఫలమైంది. వరుసగా వికెట్లు కోల్పోయి ఒక దశలో 137 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అత్యంత సంయమనం ప్రదర్శిస్తూ 118 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. చివరి వికెట్‌కు వంశ్ చౌదరితో కలిసి విలువైన పరుగులు జోడించి జట్టు స్కోరును 202 పరుగులకు చేర్చాడు.

**వినోద్ కాంబ్లీ రికార్డ్ బ్రేక్ చేసిన రింకు:**

ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో బీహార్‌పై 112 రన్స్ చేసిన రింకూ, తాజాగా గోవాపై 118 నాటౌట్‌తో వరుసగా రెండో శతకాన్ని నమోదు చేశాడు. ఈ అద్భుత ప్రదర్శనతో రింకూ ఫస్ట్ క్లాస్ బ్యాటింగ్ సగటు 61.33కు పెరిగింది. దీంతో అంతకుముందు 59.67 సగటుతో ఉన్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ రికార్డును రింకూ సింగ్ బ్రేక్ చేసేశాడు. ఇప్పటి వరకు 55 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన రింకూ, 78 ఇన్నింగ్స్‌ల్లో 3,987 పరుగులు బాదేశాడు. ఇందులో 11 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యధిక శతకాలు నమోదు చేసిన బ్యాటర్‌గానూ అతను నిలిచాడు.



**ఫస్ట్ క్లాస్ ఆల్-టైమ్ హైయెస్ట్ యావరేజ్ జాబితా:**

డాన్ బ్రాడ్‌మన్ - 95.14
విజయ్ మర్చంట్ - 71.64
జార్జ్ హెడ్లీ - 69.86
అజయ్ శర్మ - 67.46
విలియం పాన్స్‌ఫర్డ్ - 65.18
విలియం వుడ్‌ఫుల్ - 64.99
శాంతను సుగ్వేకర్ - 63.10
సర్ఫరాజ్ ఖాన్ - 62.92
రింకూ సింగ్ - 61.33
కే.సీ.ఇబ్రహీం - 61.24

**లాస్ట్11 ఇన్నింగ్స్‌ల్లో రింకు కిరాక్ ఫామ్:**

రింకూ సింగ్ తన చివరి 11 ఫస్ట్ క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 850 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌ల సగటు 94.44గా ఉండటం విశేషం.

కేవలం టీవీల్లో సిక్సర్లు కొట్టే ప్లేయర్‌గానే కాకుండా, రెడ్ బాల్ క్రికెట్‌లోనూ తాను నిలకడగల బ్యాటర్‌నని రింకూ నిరూపించుకుంటున్నాడు. ఈ సూపర్ ఫామ్ చూశాక, భారత టెస్టు జట్టులోకి అతనికి పిలుపు వస్తుందనే చర్చ క్రికెట్ వర్గాల్లో జోరుగా కొనసాగుతోంది.

# తమన్నా బోల్డ్ ప్లానింగ్ దిమ్మతిరిగేలా!

దాదాపు 18 ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా.. విభిన్నమైన పాత్రలతో కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. ఒకప్పుడు కమర్షియల్ సినిమాలు, గ్లామర్ పాత్రలు, డ్యాన్స్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామ.. ఇప్పుడు ఓటీటీ, హారర్, బోల్డ్ కంటెంట్ ఉన్న కథలతోనూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.'లస్ట్ స్టోరీస్ 2', 'జీ కర్దా' వంటి ప్రాజెక్టుల్లో విభిన్నమైన పాత్రలు పోషించిన తమన్నా.. ప్రస్తుతం 'రాగిణి 3'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ హారర్ చిత్రానికి సంబంధించిన షూటింగ్ 2026 జూలైలో ప్రారంభమైంది. 2027లో విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, ఏక్తా కపూర్ 'ది డర్టీ పిక్చర్ 2'ను రూపొందిస్తున్నట్లు ప్రకటించడంతో ఈ సినిమాపైనా ఆసక్తి పెరిగింది. అయితే ఇందులో తమన్నా నటించనున్నారనే వార్తకు ఇంకా అధికారిక ధ్రువీకరణ లేదు.మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా కథలను ఎంచుకుంటున్న తమన్నా.. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలపై దృష్టి సారిస్తున్నారు. కొత్త తరహా కథలతో ఆమె ఎలాంటి విజయాలు అందుకుంటారో చూడాలి.



# ఆ నలుగురు స్టార్ హీరోల ఫ్యాన్స్‌కి బిగ్ గుడ్‌న్యూస్



టాలీవుడ్‌లో దసరా సందడి కనిపిస్తోంది. బాక్సాఫీస్ వద్ద పలు సినిమాలు సందడి చేస్తున్న విషయం తెల్సిందే. దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవడం కోసం చాలా సినిమాలు విడుదల అయ్యాయి. అందులో కొన్ని సినిమాలను తెలుగు ప్రేక్షకులు తిరస్కరిస్తే, కొన్ని సినిమాలకు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు నమోదు అవుతున్నాయి. మొత్తానికి టాలీవుడ్ బాక్సాఫీస్ కళకళలాడుతోందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దసరాకు స్టార్ హీరోల సినిమాలు, సూపర్ స్టార్ హీరోల సినిమాలు రాలేదు. అయినా కూడా ప్రేక్షకులు వచ్చిన సినిమాలను చూస్తూ దసరా పండుగ చేసుకునేందుకు సిద్ధం అయ్యారు. ఇక దసరా పండుగ సందర్భంగా స్టార్ హీరోల సినిమాల నుంచి కీలక అప్‌డేట్స్ వస్తాయని ఆయా హీరోల అభిమానులు, మీడియా వర్గాల వారు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**ప్రభాస్ ఫౌజీ, స్పిరిట్ సినిమాల అప్‌డేట్స్...**

ముఖ్యంగా ప్రభాస్ నటించిన ఫౌజీ, స్పిరిట్ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాదిలో ప్రభాస్ నుంచి ఒక సినిమా వస్తుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు. దసరా లేదా దీపావళి వరకు ప్రభాస్ సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ ను ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఇటీవలే ప్రభాస్ స్పిరిట్ సినిమా వచ్చే ఏడాది దీపావళికి విడుదల కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అయితే ఫౌజీ సినిమా విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. దసరా లేదా దీపావళి సందర్భంగా ప్రేక్షకులకు ఆ సినిమా అప్‌డేట్ ఇస్తే తప్పకుండా మంచి రీచ్ ఉంటుంది అనే అభిప్రాయం ను వ్యక్తం చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. అందుకే ప్రభాస్ రెండు సినిమాల అప్‌డేట్స్(టీజర్/పోస్టర్స్) అతి త్వరలోనే రానున్నాయి.

**రంగస్థలం తర్వాత చరణ్-సుకుమార్ కాంబో మూవీ...**

ఇక రామ్ చరణ్, సుకుమార్ కాంబోలో రూపొందుతున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన సైతం ఇదే ఏడాది వస్తుందని తెలుస్తోంది. రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో గతంలో రంగస్థలం సినిమా వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా రామ్ చరణ్‌కి మంచి పేరును తెచ్చి పెట్టింది. ఇక సుకుమార్ దర్శకత్వంలో ఆ తర్వాత వచ్చిన పుష్ప రికార్డ్‌ల వర్షం కురిపించింది. పాన్ ఇండియా రేంజ్‌లో పుష్ప సినిమాను విడుదల చేయడం జరిగింది. అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా అన్ని చోట్ల పుష్ప ప్రభంజనం కనిపించింది. అందుకే రామ్ చరణ్‌తో సుకుమార్ చేయబోతున్న సినిమాను సైతం పాన్ ఇండియా రేంజ్‌లో ప్రేక్షకులు అలరిస్తారనే నమ్మకం వ్యక్తం అవుతుంది. ఆ సినిమా తాలూకు అప్‌డేట్ ను మరికొన్ని రోజుల్లోనే సుకుమార్ అండ్ టీం నుంచి వినబోతున్నాం. మైత్రి మూవీ మేకర్స్ వారు అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎన్టీఆర్, అల్లు అర్జున్‌ల సినిమాల అప్డేట్స్...**

ఎన్టీఆర్, అల్లు అర్జున్‌ల సినిమాలకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ సైతం అతి త్వరలోనే రాబోతున్నట్లు తెలుస్తోంది. చాలా గ్యాప్ తర్వాత ఎన్టీఆర్ డ్రాగన్ షూట్‌లో పాల్గొంటున్నాడు. దసరా కి ప్రత్యేకంగా సర్‌ప్రైజ్ చేయాలనే ఉద్దేశంతో దర్శకుడు ప్రశాంత్ నీల్ వీడియోను రెడీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. పండుగకి ఒక మంచి పోస్టర్ విడుదల చేయడంతో పాటు, సినిమా విడుదల తేదీ, ఇతర విషయాలకు సంబంధించిన వివరాలను క్లారిటీగా చెప్పే అవకాశం ఉంది. కనుక అతి త్వరలోనే ఎన్టీఆర్ ఫ్యాన్స్ కి డ్రాగన్ యూనిట్ నుంచి పెద్ద సర్‌ప్రైజింగ్ న్యూస్ రావడం కన్ఫర్మ్ అయింది. ఎన్టీఆర్-నీల్ కాంబో డ్రాగన్ సినిమా పాన్ ఇండియా రేంజ్‌ను మించి విడుదల కాబోతున్నట్లుగా చెబుతున్నారు. కనుక సినిమా అప్‌డేట్ వస్తుంది అంటే కచ్చితంగా ఫ్యాన్స్ కి పెద్ద గుడ్ న్యూస్ కాదా మరి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న 'రాకా' సినిమా అప్‌డేట్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హాలీవుడ్ రేంజ్ మూవీ అంటూ రాకా గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కనుక రాకా సినిమా నుంచి వచ్చే అప్‌డేట్ కి పాన్ ఇండియా రేంజ్‌లో క్రేజ్ ఉంటుంది. అల్లు అర్జున్ ఫ్యాన్స్ కి అతి త్వరలోనే ఆ రేంజ్ సర్‌ప్రైజ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఒక వైపు రాకా సినిమాతో బిజీగా ఉన్నప్పటికీ అల్లు అర్జున్ నుంచి అతి త్వరలోనే కొత్త సినిమా అప్‌డేట్ వస్తుందనే వార్తలు వస్తున్నాయి. అది కూడా ఈ రెండు మూడు నెలల్లోనే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. అల్లు అర్జున్ కొత్త సినిమా దర్శకుడు ఎవరు, ఇతర అప్‌డేట్స్ ఏంటీ అనేది ఇదే ఏడాది చివరి వరకు వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయి. కనుక అల్లు అర్జున్ ఫ్యాన్స్ కి కూడా అతి త్వరలోనే రెండు బిగ్ గుడ్ న్యూస్ వినిపించే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి నలుగురు స్టార్ హీరోలు వచ్చే ఏడాది బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ఏడాదిలో ఈ స్టార్ హీరోల ఫ్యాన్స్ కోసం బిగ్ అప్‌డేట్స్ వదలబోతున్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965